**ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి**

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం



PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక

సంపుటి: 6 సంచిక: 78, పేజీలు - 08

బుధవారం, సెప్టెంబర్ 16, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD







## తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములుకండి

### - ప్రిన్స్ ఆగా ఖాన్-5ను కోరిన సీఎం

- ఆగా ఖాన్ ఫౌండేషన్‌పై అత్యంత గౌరవం ఉందన్న సీఎం రేవంత్
- మూసీ నది పునరుజ్జీవం కోసం ప్రణాళికలు
- 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామన్న సీఎం
- 15 వేల ఎకరాల్లో గ్రీన్ జోన్ ఏర్పాటు చేస్తున్నాం



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో ఆగా ఖాన్ ఫౌండేషన్ ద్వారా మరింత సహకారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణలోని విద్యా, పర్యాటక, వైద్య రంగాల్లో కలిసి పని చేద్దామని కోరారు. భారత పర్యటనలో ఉన్న ఆగా ఖాన్ ఫౌండేషన్ చైర్మన్ హిజ్ హైనెస్ ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-ఎ హైదరాబాద్ వచ్చిన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. తాజ్ ఫలక్‌నుమా ప్యాలెస్‌లో జరిగిన ఈ సమావేశంలో ఆగా ఖాన్ ఫౌండేషన్ ద్వారా తెలంగాణలో చేపట్టిన అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి గుర్తుచేశారు.

2లో..

## యూపీఐపై ఫీజు బాదుడుకు నిశ్శబ్దంగా డోర్లు తెరిచారు

### - కేంద్రంపై రాహుల్ గాంధీ విమర్శలు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) యూపీఐ లావాదేవీలపై ఫీజులు విధిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ , కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా స్పందించారు. ప్రధాని నరేంద్ర మోదీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడిన రాహుల్ గాంధీ అమెరికా ఒత్తిళ్లకు లొంగిపోయారని ఆరోపించారు. రూ. 2,000 కంటే ఎక్కువ విలువైన వ్యాపార (మర్చంట్) యూపీఐ లావాదేవీలపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ విధించేందుకు మోదీ ప్రభుత్వం తలుపులు తెరిచిందని రాహుల్ గాంధీ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పేర్కొన్నారు.

మొత్తం యూపీఐ లావాదేవీలలో ఇవి కేవలం 5% మాత్రమే అయినప్పటికీ నిధుల విలువ పరంగా ఇవి దాదాపు 65% వరకు ఉంటాయని ఆయన తెలిపారు. కస్టమర్లపై ఎలాంటి ఫీజు విధించమని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, వ్యాపారులపై పడే ఈ భారం చివరికి వస్తువుల ధరలు పెరగడం ద్వారా సాధారణ ప్రజల జేబుల్లోంచే వస్తుందని ఆయన స్పష్టం చేశారు. అమెరికా పేమెంట్ కంపెనీలు చాలా కాలంగా భారతదేశపు 'జీరో-ఎమ్డీఆర్' విధానాన్ని

2లో..

## ఉద్యోగులతో పెట్టుకుంటున్నారు.. కాంగ్రెస్ ఓటమి ఖాయం

- ఉద్యోగులు, ఉపాధ్యాయులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపణ
- 630 మండలాలకు 8 మంది పర్మినెంట్ ఎంఈవోలే ఉన్నారని విమర్శ
- పీఆర్సీ, డీఏలపై ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపణ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మాట తప్పడం, మడమ తిప్పడం రేవంత్ రెడ్డి ట్రేడ్ మార్క్ అని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు.ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలం అయ్యారని ధ్వజమెత్తారు.ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలపై తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో మంగళవారం బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న ఉద్యోగులను రేవంత్ రెడ్డి బెదిరిస్తున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి బెదిరింపులకు భయపడేందుకు ఉద్యోగులు బానిసలు కాదన్న విషయం గుర్తు పెట్టుకోవాలని హెచ్చరించారు. ఉద్యోగులు, ప్రభుత్వ ఉపాధ్యాయులతో పెట్టుకున్న

2లో..

## తెలంగాణలో 'రాజీవ్ యువ వికాసం' పథకం

- ఒక్కొక్కరికీ రూ.1 లక్ష ఆర్థిక సాయం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) యువతకు స్వయం ఉపాధి అవకాశాలను పెంచే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయానికి ఆమోదం తెలిపింది. రాష్ట్రంలోని అర్హులైన యువతకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించనున్నారు. ఈ పథకం ద్వారా యువతకు స్వయం ఉపాధి కింద రూ.1 లక్ష వరకు ఆర్థిక సాయం అందించేందుకు చర్యలు వేగవంతం చేసింది. నవంబర్ 19వ తేదీ నుంచి ఈ రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేయాలని

2లో..

## 2029 నాటికి అర్హులందరికీ సొంతిల్లు

### - గృహ నిర్మాణ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష

- 2027 మార్చి నాటికి 5.52 లక్షల గృహాలు పూర్తి చేయాలని సీఎం ఆదేశం - ఉచిత ఇళ్ల స్థలాల కోసం పారదర్శక విధానం అమలు చేయాలని సూచన
- కేంద్ర సహకారంతో రాష్ట్రంలో పారిశ్రామిక టౌన్‌షిప్‌ల ఏర్పాటుకు ప్రణాళిక



అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి 2029 నాటికి సురక్షితమైన, శాశ్వతమైన గృహాన్ని అందించడమే లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 'హౌసింగ్ ఫర్ ఆల్' కార్యక్రమాన్ని సాచురేషన్ విధానంలో అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా 2027 మార్చి నాటికి 5.52 లక్షల ఇళ్లను పూర్తి చేయాలని గడువు నిర్దేశించారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథితో పాటు ఆ శాఖ, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

2లో..

## 40 ఎకరాల భూమి శాంతా శ్రీరామ్ సంస్థదే

### - సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి చుక్కెదురు



న్యూఢిల్లీ / హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్? నగరంలో గత కొంతకాలంగా తెలంగాణ ప్రభుత్వానికి, శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ సంస్థకు మధ్య జరుగుతున్న భూ వివాదంలో సుప్రీంకోర్టు సంచలన తీర్పును వెలువరించింది. ఆ 40 ఎకరాల్లో ఉన్న నిర్మాణాలను హైడ్రా అధికారులు కూల్చివేయడంతో ఈ వివాదం తెరపైకి వచ్చింది.

2లో..

## తెలంగాణ మరో బంగ్లాదేశ్ కాబోతోంది

### - బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలనపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ కుమార్ తీవ్ర విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసిపోయి, తెలంగాణ ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అసెంబ్లీలో ప్రతిపక్షాలకు మాట్లాడే అవకాశం, కాంగ్రెస్‌లో సీఎం పదవిపై నెలకొన్న పోటీ వంటి అంశాలపై ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్‌లో ముఖ్యమంత్రి పదవి కోసం పోటీ మొదలైందని కరీంనగర్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో బండి సంజయ్ ఆరోపించారు. అసెంబ్లీలో ఆయా నేతలు వ్యవహరిస్తున్న తీరును గమనిస్తే ఈ పోటీ స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. తెలంగాణలో

2లో..

## తిరుమలలో సాలకట్ల బ్రహ్మోత్సవాలు

- ధ్వజస్తంభంపై గరుడ పటాన్ని ఎగురవేసిన వేదపండితులు
- కుటుంబ సభ్యులతో కలిసి విచ్చేసిన చంద్రబాబు
- రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం



తిరుమల (ప్రశ్న న్యూస్) కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం సాయంత్రం ధ్వజారోహణంతో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇదే సమయంలో, రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ రెండు ప్రధాన ఘట్టాలతో తిరుమల గిరులు గోవింద నామస్మరణతో మార్మోగాయి. బ్రహ్మోత్సవాల ప్రారంభ సూచికగా, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి వారి సమక్షంలో పండితుల వేదమంత్రోచ్చారణలు,

2లో..

## సీఎం రేవంత్‌తో విభేదాల్లేవు, కొండా సురేఖ బర్తరఫ్ బాధించింది

### - పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తనకు మధ్య ఎలాంటి గ్యాప్ లేదు అని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. తమ మధ్య ఏదో గ్యాప్ ఉందంటూ పత్రికల మాత్రమే సృష్టిస్తున్నారని అలాంటి గ్యాప్ తమ మధ్య లేదు అని పీసీసీ చీఫ్ చెప్పుకొచ్చారు. తమ మధ్య గ్యాప్ ఉందని పత్రికల్లో వస్తుంది కానీ గొడవ లేదు అని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్ రెడ్డితో అభిప్రాయ భేదాలు వచ్చినా సాయంత్రానికే సరిచేసుకున్నాం. పార్టీ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ఎప్పుడూ జోక్యం చేసుకోలేదు అని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.పీసీసీ అధ్యక్షుడిగా రెండేళ్ల ప్రయాణం ఎంతో ఉత్సాహంగా సాగిందని, పీసీసీ పదవిని బాధ్యతగా, సంతృప్తిగా నిర్వహించినట్లు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు.

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో నా వేవ్‌లెంగ్త్ మ్యాచ్ అయింది**

పీసీసీ అధ్యక్షుడిగా రెండేళ్ల ప్రయాణం ఎంతో ఉత్సాహంగా సాగింది అని ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. పీసీసీ అధ్యక్ష పదవిని ఒక బాధ్యతగా

3లో..

## ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల కొరత

### - ప్రైవేటు హాస్పిటల్స్ వైపు రోగుల చూపు - రాష్ట్రవ్యాప్తంగా 2,238 పోస్టులు ఖాళీ

### - జిల్లా ఆస్పత్రులపై పెరుగుతున్న భారం




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** పేదవారికి నొప్పి వచ్చినా రోగం వచ్చినా ప్రభుత్వాసుపత్రికే వెళ్తుంటారు. ప్రైవేటు హాస్పిటల్స్‌లో భారీగా డబ్బులు ఖర్చు పెట్టే ఆర్థిక స్థోమత లేక సర్కార్ దవాఖానాలకు పరుగులు తీస్తుంటారు. అయితే అక్కడ సరైన వసతులు, డాక్టర్లు లేకపోవటంతో వైద్యం అందటం లేదు. దీంతో దిక్కుతోచని పరిస్థితుల్లో ప్రైవేటును ఆశ్రయించి అప్పులపాలవుతున్నారు. ప్రస్తుతం తెలంగాణ సర్కార్ దవాఖానాల్లో వైద్యుల కొరత వేధిస్తోంది. ప్రభుత్వ బోధన, ద్వితీయ శ్రేణి ఆస్పత్రుల్లో మంజూరైన వైద్యుల పోస్టుల్లో దాదాపు 30 శాతం భర్తీ కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 7,515 మంజూరైన వైద్యుల పోస్టులకు గాను 2,238 ఖాళీగా ఉన్నట్లు ఆరోగ్యశాఖ గణాంకాలు వెల్లడించాయి.

3లో..

## ఉద్యోగులతో పెట్టుకుంటున్నారు..

# కాంగ్రెస్ ఓటమి ఖాయం

ఏ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాలేదని కాంగ్రెస్ సర్కార్ పని కూడా అయిపోయిందని తేల్చిచెప్పారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వచ్చాక ఉద్యోగులు సంతోషంగా, గౌరవంగా ఉండేలా చూస్తామని, వాళ్లను అభివృద్ధిలో డెవలపర్స్ గా చేస్తామని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత హామీ ఇచ్చారు.

### మాట తప్పడం, మడమ తిప్పడం రేవంత్ ట్రేడ్ మార్క్

తెలంగాణ ఉద్యోగులకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం నెరవేర్చడంలో విఫలమైంది అని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత అన్నారు. ఉద్యోగులకు ఇచ్చే డీఏలు, పీఆర్సీ, పెన్షన్లు, రిటైర్ మెంట్ బెనిఫిట్స్ విషయంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇవే సమస్యలపై గత ప్రభుత్వాన్ని ఇష్టమొచ్చినట్లు తిట్టిన రేవంత్ రెడ్డి ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగులకు ఎందుకు మేలు చేయడం లేదని నిలదీశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతున్న ఉద్యోగులను బెదిరిస్తూ వాళ్ల నోరు మూయించే ప్రయత్నం చేస్తున్నారని విరుచుకుపడ్డారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రయోజనాలను అడిగే విషయంలో ఉద్యోగులు భయపడాల్సిన అవసరం లేదని కవిత భరోసా ఇచ్చారు. తల్లి కాంగ్రెస్ తోనే పోరాడి తెలంగాణ తెచ్చుకున్న మనకు ఈ పిల్ల కాంగ్రెస్ తో పోరాటం చేయడం ఓ లెక్క కాదు అని చెప్పుకొచ్చారు. ఉద్యోగులకు గత 32 నెలలుగా ఆరు డీఏలు బకాయిలు పెట్టారని ధ్వజమెత్తారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు అనుగుణంగా ఇవ్వాల్సిన కరవు భత్యాన్ని ఈ ముఖ్యమంత్రే మింగేశారని, ఏ ప్రభుత్వమైనా పారదర్శకమైన పాలన అందించాలంటే అందుకు ప్రభుత్వ ఉద్యోగులదే కీలక పాత్ర అని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. అలాంటి ప్రభుత్వ ఉద్యోగులను చిన్న చూపు చూస్తూ వారి పట్ల రేవంత్ రెడ్డి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాట తప్పడం, మడమ తిప్పడం అనేది రేవంత్ రెడ్డి ట్రేడ్ మార్క్ అని కవిత విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కవిత హితవు పలికారు.

### టీచర్ల తో పెట్టుకున్న ప్రభుత్వాలు మళ్లీ గెలవలేదు

ప్రభుత్వ టీచర్లు, ఉద్యోగులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం కూడా మళ్లీ గెలవలేదని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి సర్కార్ కూడా మళ్లీ గెలవదని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఒక్క టీచర్, ప్రభుత్వ ఉద్యోగి కూడా సంతోషంగా లేరని ముఖ్యంగా టీచర్ల విషయంలో ప్రభుత్వ వైఖరి అమానుషంగా ఉందని మండిపడ్డారు. టీచర్లకు ఇవ్వాల్సిన ప్రమోషన్లు ఇవ్వటం లేదని, డీఏ బకాయిలు పెండింగ్ పెడుతున్నారని మండిపడ్డారు. పైగా ఎప్పుడు ఏదో రిపోర్ట్ పేరుతో వాళ్లని చదువు చెప్పకుండా చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో 40 శాతం పోస్టులు ఖాళీలు ఉంటే వాటిని భర్తీ చేయకుండా ఉన్న టీచర్లను సరిగా చూసుకోకుండా ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 2003 లో రిక్రూట్ అయిన టీచర్లకు ఓపీఎస్ అమలు చేయాలని కవిత డిమాండ్ చేశారు. వారి పెన్షన్ విధానాన్ని ఓపీఎస్ కు బదిలీ చేస్తే ప్రభుత్వానికి రూ. 2 వేల కోట్లు వస్తాయని చెప్పారు. ఈ విషయం కూడా ముఖ్యమంత్రి తెలియదని కవిత ఎద్దేవా చేశారు. వెంటనే వారిని ఓపీఎస్‌కు మార్చి వచ్చే 2 వేల కోట్లతో ప్రభుత్వ టీచర్లు, ఉద్యోగుల బకాయిలు చెల్లించాలని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు.

### 18 లోగా సమస్యలు పరిష్కరించాలి

ఎన్నికలకు ముందు ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కరిస్తానని చెప్పిన ముఖ్యమంత్రి ఇప్పుడు అడిగితే బెదిరింపులకు దిగుతున్నాడని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత ధ్వజమెత్తారు. కనీసం ఉద్యోగుల హెల్త్ కార్డు కూడా పనిచేయని పరిస్థితి అని అన్నారు. ఏ ప్రైవేట్ హాస్పిటల్ లోనైనా హెల్త్ కార్డు చెల్లుబాటు అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చెప్పిన చేసేందుకు టీఆర్ఎస్ సిద్ధంగా ఉందని కవిత అన్నారు. ఒకవేళ హెల్త్ కార్డు పనిచేయకపోతే ఈ ముఖ్యమంత్రి రాజీనామా చేస్తారా అంటూ కవిత బహిరంగ సవాల్ విసిరారు. పోలీసుల పరిస్థితి కూడా బాగాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి రావాల్సిన ప్రయోజనాలను వెంటనే చెల్లించాలని, 2003 లో రిక్రూట్ అయిన వారికి ఓపీఎస్ పెన్షన్ సిస్టం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏ ప్రభుత్వంలోనైనా ప్రభుత్వ ఉద్యోగులు సంతోషంగా లేకుంటే పరిపాలన ఎక్కడికక్కడ పడకేస్తుందని చెప్పుకొచ్చారు.

రాష్ట్రంలోని 206 ఉద్యోగ సంఘాలు జేఏసీ గా ఏర్పడి ప్రభుత్వం ముందుంచిన 37 డిమాండ్లలో చాలా వరకు డబ్బుతో సంబంధం లేనివేనని అన్నారు. 317 జీవో సహా చాలా సమస్యలను ప్రభుత్వం సులభంగా పరిష్కరించే పరిస్థితి ఉన్నప్పటికీ పట్టించుకోవటం లేదని విమర్శించారు. ఉద్యోగ సంఘాలు కూడా ప్రభుత్వానికి భయపడి ధర్నాలను పోస్ట్ పోన్ చేసుకుంటుండంతో కిందిస్థాయి ఉద్యోగుల్లో ఉద్యోగ సంఘాలపై నమ్మకం లేకుండా పోతోందన్నారు. తమ డిమాండ్ల విషయంలో ప్రభుత్వ ఉద్యోగులు ఎట్టి పరిస్థితుల్లో భయపడాల్సిన అవసరం లేదని కవిత భరోసా ఇచ్చారు. ఈ నెల 18 లోగా సమస్యలు పరిష్కారిస్తామని ఉద్యోగ సంఘాలకు ప్రభుత్వం ఇచ్చిన హామీని కవిత గుర్తు చేశారు. ఒక వేళ సమస్యలు పరిష్కారం కాకపోతే హైదరాబాద్ దిగ్బంధనానికి ఉద్యోగ సంఘాలు పిలుపునివ్వాలని కవిత కోరారు. వారికి తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తెలంగాణ రక్షణ సేన రానున్న రోజుల్లో కచ్చితంగా అధికారంలోకి వస్తుందని కవిత ధీమా వ్యక్తం చేశారు.

## తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములుకండి

ఆగా ఖాన్ ఫౌండేషన్‌పై అత్యంత గౌరవం ఉందని పేర్కొంటూ హైదరాబాద్‌తో ఆగా ఖాన్ కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తెలంగాణ వారసత్వ సంపదను పునరుద్ధరించడంలో ఫౌండేషన్ అత్యంత కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. ఫౌండేషన్ సహకారంతో ఇటీవల శాసనమండలి భవనాన్ని పునరుద్ధరించడం, అలాగే నగరంలోని కుతుబ్ షాహీ టూంబ్స్‌ను పునరుద్ధరించిన విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తుచేశారు.

### ఆగా ఖాన్ ఫౌండేషన్ చైర్మన్‌తో సీఎం రేవంత్ రెడ్డి భేటీ

హైదరాబాద్ నగర పునర్నిర్మాణంలో భాగంగా మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టుపై సిద్ధం చేసిన ప్రణాళికలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగా ఖాన్ ఫౌండేషన్ చైర్మన్ హిజ్ హైనెస్ ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5కు వివరించారు. మూసీ నది వెంట నైట్ ఎకానమీ కార్యకలాపాల దిశగా తీర్చిదిద్దుతున్న విషయాలను తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఉన్న చారిత్రక సిటీ కాలేజ్, ఉస్మానియా ఆసుపత్రి భవనాల పునరుద్ధరణలో సహకరించాలని కోరారు. ఉస్మానియా ఆసుపత్రి కోసం గోషామహల్‌లో నూతన భవనాన్ని నిర్మిస్తున్నామని, ప్రస్తుత ఉస్మానియా ఆసుపత్రి భవనాన్ని వారసత్వ సంపదగా తీర్చిదిద్దాలని భావిస్తున్నట్టు వివరించారు. డిసెంబర్ 7వ తేదీ నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించబోయే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలని ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5ని ముఖ్యమంత్రి ఆహ్వానించారు. సమ్మిట్‌కు 100కు పైగా దేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.

### ఫ్యూచర్ సిటీపై వివరణ

ఫ్యూచర్ సిటీ నిర్మాణంపై ప్రిన్స్ ఆగా ఖాన్-5 ఆసక్తిని కనబరిచి దాని ప్రాధాన్యతను అడిగి తెలుసుకున్నారు. 30 వేల ఎకరాల్లో అత్యాధునిక సదుపాయాలతో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని, అంతర్జాతీయ విమానాశ్రయానికి 20 నిమిషాల దూరంలో నిర్మించే ఫ్యూచర్ సిటీ పూర్తిగా నెట్-జీరో సిటీగా ఉండబోతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. సింగపూర్‌కు చెందిన కంపెనీ ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తోందని,ఇందులో దాదాపు 15 వేల ఎకరాల్లో గ్రీన్ జోన్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఫ్యూచర్ సిటీలో అమెజాన్ వంటి సంస్థలు ఇప్పటికే తమ కార్యకలాపాలను ప్రారంభించాయని గుర్తుచేస్తూ 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి వివరించారు.

### ఆగా ఖాన్ యూనివర్సిటీని ఏర్పాటు చేయండి

ఇటీవల బ్రిటన్, అమెరికా పర్యటనల్లో వివిధ ప్రపంచస్థాయి యూనివర్సిటీలతో తెలంగాణ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల గురించి సీఎం సలహాదారు కె. రామకృష్ణా రావు సమావేశంలో ప్రిన్స్ రహీమ్ ఆగా ఖాన్-5కి వివరించారు. హార్వర్డ్ యూనివర్సిటీ, లండన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌తో పాటు ఇతర యూనివర్సిటీలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలు ప్రారంభించడానికి అంగీకరించాయని తెలిపారు. ఫ్యూచర్ సిటీలో ఆగా ఖాన్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని రాష్ట్ర విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితా రాణా కోరారు. పర్యాటక రంగంలో అగా ఖాన్ ఫౌండేషన్ పాత్రను స్పెషల్ చీఫ్ సెక్రటరీ వాణీ ప్రసాద్ గుర్తుచేస్తూ భవిష్యత్తులో మరింత సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో పాటు ఉన్నతాధికారులు, ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

# తెలంగాణ మరో బంగ్లాదేశ్ కాబోతోంది

ప్రభుత్వం సక్రమంగా పనిచేయడం లేదని విమర్శించారు.కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజా సమస్యలపై మాట్లాడే నైతిక అర్హతను కోల్పోయాయని బండి సంజయ్ విమర్శలు చేశారు. బీఆర్ఎస్ నేతలు డ్రామా ఆర్టిస్టుల్లా వ్యవహరిస్తుంటే కాంగ్రెస్ ప్రభుత్వం వారిని ఆడించే స్థాయికి చేరిందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అదే సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిపై బీఆర్ఎస్ అసెంబ్లీలో ఎందుకు గట్టిగా నిలదీయడం లేదని ప్రశ్నించారు. రెండు పార్టీల వైఖరి కారణంగా ప్రజలు అసహ్యించుకుంటున్నారని మండిపడ్డారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపైనా బండి సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. భూములు అమ్ముకుంటూ ప్రభుత్వాన్ని నడిపే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. ఇదే విధానం కొనసాగితే తెలంగాణ శ్రీలంక, బంగ్లాదేశ్, పాకిస్తాన్ తరహాలో ఆర్థిక ఇబ్బందుల్లోకి వెళ్లే ప్రమాదం ఉందని వ్యాఖ్యానించారు. కర్ణాటకలో ఆర్థిక పరిస్థితులపై అక్కడి నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ తెలంగాణలోనూ అలాంటి పరిస్థితులు కనిపిస్తున్నాయని పేర్కొన్నారు.అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, నేతలు బ్లాక్ టీషర్టులు ధరించి నిరసన తెలిపిన అంశాన్ని కూడా బండి సంజయ్ ప్రస్తావించారు. పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ, కాంగ్రెస్ ఎంపీలు బ్లాక్ టీషర్టులు ధరించి వచ్చిన సందర్భంలో వారిని సస్పెండ్ చేయలేదని గుర్తు చేశారు. అయితే తెలంగాణ అసెంబ్లీలో నల్ల టీషర్టులతో వచ్చిన బీఆర్ఎస్ నేతలపై సస్పెన్షన్ చర్యలు తీసుకోవడం ఏంటని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు ఢిల్లీలో ఒక విధానం, తెలంగాణలో మరో విధానం ఉన్నట్లుగా కనిపిస్తోందని విమర్శించారు.బీఆర్ఎస్ 10 ఏళ్ల పాలనలో జరిగిన తప్పులపై విచారణ జరిపిస్తామని కాంగ్రెస్ గతంలో చెప్పిందని అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదని బండి సంజయ్ ప్రశ్నించారు. అవినీతికి పాల్పడ్డారని ఆరోపిస్తున్న బీఆర్ఎస్ నేతలపై చర్యలు తీసుకుని జైలుకు ఎందుకు పంపడం లేదని నిలదీశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు అవినీతి అనే నాణేనికి బొమ్మా బొరుసుల్లా మారాయని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల సమయాన్ని ప్రజా సమస్యల పరిష్కారానికి ఉపయోగించకుండా రాజకీయ విమర్శలతో వృథా చేస్తున్నారని ఆరోపించారు.తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని గతంలో చెప్పిన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఇప్పుడు వెనక్కి తగ్గాయని బండి సంజయ్ ఆరోపించారు. మజ్లిస్ పార్టీకి భయపడే ఈ రెండు పార్టీలు తెలంగాణ పోరాట చరిత్రకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని విమర్శించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే రాష్ట్ర ప్రభుత్వం తరఫున గ్రామస్థాయి వరకు తెలంగాణ విమోచన దినోత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. తెలంగాణ పోరాట చరిత్రను పాఠ్యపుస్తకాల్లో భాగంగా చేర్చేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.ఇదిలా ఉండగా ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా.. దేశ ప్రధానిగా 25 ఏళ్ల ప్రజా ప్రస్థానాన్ని పురస్కరించుకుని బీజేపీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బండి సంజయ్ తెలిపారు. సెప్టెంబర్ 17వ తేదీ నుంచి అక్టోబర్ 17వ తేదీ వరకు సేవా సంకల్ప్ అభియాన్-జన్ సేవా హీ ప్రభు సేవా పేరుతో దేశవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. సెప్టెంబర్ 17వ తేదీన సాయంత్రం 7 గంటలకు ఆశీర్వాద దీపం కార్యక్రమంలో ప్రజలు దీపాలు వెలిగించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులు కూడా ఇందులో పాల్గొనాలని కోరారు. అదే రోజు దేశవ్యాప్తంగా రక్తదాన శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 17వ తేదీ నుంచి అక్టోబర్ 7వ తేదీ వరకు పాఠశాలల్లో 'సేవ-అంకితభావం-25 సంవత్సరాలు'.. 'వికసిత భారత్' అంశాలపై చిత్రలేఖనం, ప్రసంగ పోటీలు నిర్వహించాలని నిర్ణయించినట్లు చెప్పారు. సెప్టెంబర్ 25వ తేదీ నుంచి అక్టోబర్ 7వ తేదీ వరకు 'అంగన్ మిలన్ సేవ' కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలను సన్మానించనున్నట్లు బండి సంజయ్ తెలిపారు. మోదీ ప్రభుత్వ పథకాల వల్ల ప్రజల జీవితాల్లో వచ్చిన మార్పులను లబ్ధిదారుల అనుభవాల రూపంలో సోషల్ మీడియాలో ప్రచారం చేయనున్నట్లు చెప్పారు.అక్టోబర్ 7వ తేదీన 'సేవా జ్యోతి కలశ యాత్ర-వికసిత భారత్ సంకల్పం' పేరుతో గ్రామాలు, ప్రాంతాల్లో యాత్రలు నిర్వహించాలని పార్టీ నిర్ణయించిందన్నారు. యువతలో సృజనాత్మకతను ప్రోత్సహించేందుకు 'సేవా ఫస్ట్ ఇన్నోవేషన్ ఛాలెంజ్' నిర్వహించనున్నట్లు బండి సంజయ్ తెలిపారు.

యువ ఆవిష్కర్తలను ఒక వేదికపైకి తీసుకువచ్చి కొత్త ఆలోచనలు, పరిష్కార మార్గాలను ప్రోత్సహిస్తామని చెప్పారు. అలాగే 'సేవా సేతు అభియాన్' పేరుతో సెప్టెంబర్ 17వ తేదీ నుంచి అక్టోబర్ 17వ తేదీ వరకు అసెంబ్లీ, మండల స్థాయిలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. 'సుపరిపాలన-సేవా సంవాద్' పేరుతో అక్టోబర్‌లో ప్రధాన నగరాల్లో సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులతో కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బండి సంజయ్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలు, కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

## యూపీఐపై ఫీజు బాదుడుకు

# నిశ్శబ్దంగా డోర్లు తెరిచారు

వ్యతిరేకిస్తున్నాయని, వారికే అనుకూలంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని ఆరోపించారు.

### ఖర్గే విమర్శలు

కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ ద్రవ్యోల్బణంతో అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం అందించడానికి బదులుగా, ప్రజల సొమ్మును దోచుకోవడానికి ప్రభుత్వం రోజుకో కొత్త మార్గాన్ని వెతుకుతోందని మండిపడ్డారు. "యూపీఐపై ఎటువంటి రుసుము ఉండదు' అనే నినాదాన్ని ఇప్పుడు 'రూ. 2,000 వరకు మాత్రమే ఉచితం' అని మార్చేశారని, ఇది ప్రభుత్వం విధించిన 'డిజిటల్ పేమెంట్స్ టాక్స్" అని ఆయన విమర్శించారు.

### ప్రభుత్వం వివరణ, కారణాలు

రూ. 2,000 వరకు జరిగే యూపీఐ లావాదేవీలు లేదా రూపే డెబిట్ కార్డు చెల్లింపులపై ఎలాంటి రుసుములు వసూలు చేయవద్దని బ్యాంకులకు, పేమెంట్ సిస్టమ్ ప్రొవైడర్లకు సూచనలు జారీ చేశారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో ఆమోదం పొందిన 'పేమెంట్ అండ్ సెటిల్‌మెంట్ సిస్టమ్స్ యాక్ట్, 2007' సవరణల ఆధారంగా సెప్టెంబర్ 14న ఈ నోటిఫికేషన్ విడుదల చేశారు. లావాదేవీల సంఖ్య విపరీతంగా పెరుగుతున్నందున సైబర్ సెక్యూరిటీ, మోసాల నివారణ, మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం భారీగా పెట్టుబడులు అవసరమని ప్రభుత్వం వివరించింది. వ్యవస్థను స్వయం సమృద్ధిగా మార్చడానికి, పోటీని పెంచడానికి సబ్సిడీలపై మాత్రమే ఆధారపడటం సాధ్యం కాదని, అందుకే ఈ చర్యలు చేపట్టినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. ఎండీఆర్ రేట్లను ఎన్‌పీసీఐ సారథ్యంలోని కమిటీ నిర్ణయిస్తుంది.

# 2029 నాటికి అర్హులందరికీ సొంతిల్లు

ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ్), పీఎం జన్ మన్ వంటి వివిధ పథకాల కింద చేపట్టాల్సిన ఇళ్ల నిర్మాణ పనులను వచ్చే నెలలోగా గ్రౌండింగ్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. పట్టణ ప్రాంతాల్లో 1.5 లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు. డిసెంబరు 2026 నాటికి 2.05 లక్షల ఇళ్లు, 2027 మార్చి నాటికి మరో 2.74 లక్షల ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారుల గృహ ప్రవేశాలకు సిద్ధం చేయాలని ఆదేశించారు.

రాష్ట్రంలో పీఎంఏవై 1.0, 2.0, పీఎం జన్ మన్ పథకాల కింద మొత్తం 18.72 లక్షల ఇళ్లు మంజూరు కాగా, ఇప్పటివరకు 13.20 లక్షలు పూర్తయ్యాయని అధికారులు సీఎంకు వివరించారు. ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ పరిధిలో 16.11 లక్షల ఇళ్లకు గాను 11.31 లక్షలు, ఏపీ టిడ్కో పరిధిలో 2.61 లక్షల ఇళ్లకు గాను 1.88 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయిందని తెలిపారు.

**ఉచిత ఇళ్ల స్థలాలపై ప్రత్యేక కార్యాచరణ** ఇంటి స్థలం లేని అర్హులైన కుటుంబాలను కచ్చితంగా గుర్తించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సీఎం చంద్రబాబు సూచించారు. ఆవాస్ ప్లస్, హౌసింగ్, రెవెన్యూ శాఖలతో పాటు ఆర్టీజీఎస్ నుంచి డేటాను అనుసంధానం చేసి, డూప్లికేషన్ లేకుండా లబ్ధిదారులను గుర్తించాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో ప్రాథమిక జాబితాలు ప్రచురించి, అభ్యంతరాలు స్వీకరించి, పారదర్శకంగా పరిష్కరించిన తర్వాతే తుది జాబితాలను ఖరారు చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటికే ఉన్న లేఅవుట్లలో నిర్మాణాలు చేపట్టని భూమిని అవసరాన్ని బట్టి 2 లేదా 3 సెంట్ల ప్లాట్లుగా పునర్వ్యవస్థీకరించాలని నిర్దేశించారు. కుప్పం నియోజకవర్గంలో సాచురేషన్ విధానంలో గృహ నిర్మాణం చేపట్టాలని ప్రత్యేకంగా ఆదేశించారు.

**పారిశ్రామిక టౌన్‌షిప్‌ల ఏర్పాటుకు ప్రణాళిక** రాష్ట్రంలో ఆర్థిక కార్యకలాపాలను పెంచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో పారిశ్రామిక టౌన్‌షిప్‌లను నిర్మించే అంశంపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి గృహ నిర్మాణ శాఖను ఆదేశించారు. శ్రీసిటీ సహా ఇతర పారిశ్రామిక ప్రాంతాల్లో ఈ టౌన్‌షిప్‌ల ఏర్పాటు ద్వారా ఆర్థిక లావాదేవీలు పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. ఇందుకోసం ఏపీ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఐఐసీ)తో సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని సూచించారు. 2027 డిసెంబరు నాటికి మరో 75 వేల కొత్త గృహాలు మంజూరయ్యేలా, 1.5 లక్షల ఇళ్లను పైప్‌లైన్‌లో ఉంచేలా చూడాలని, ఇందుకు అవసరమైన నిధుల కోసం కేంద్ర గ్రామీణాభివృద్ధి, పట్టణాభివృద్ధి శాఖలతో సమన్వయం చేసుకోవాలని సీఎం స్పష్టం చేశారు.

# తెలంగాణలో

## 'రాజీవ్ యువ వికాసం' పథకం

రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం కింద అర్హులకు ఆర్థిక సాయం అందించేందుకు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలు జారీ చేశారు.తాజాగా ప్రజాభవన్‌లో తెలంగాణ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల పనితీరుపై ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాల అమలు, విద్య, యువతకు ఉపాధి అవకాశాలు, గురుకులాల నిర్వహణ వంటి అంశాలపై చర్చించారు. పేదలు, బహుజన వర్గాల సంక్షేమంతో పాటు విద్యాభివృద్ధి, యువతకు స్వయం ఉపాధి కల్పించడం ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. విద్యారంగ అభివృద్ధికి నిధుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.యువతకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. ఈ పథకం కింద అర్హులైన వారికి రూ.1 లక్ష వరకు ఆర్థిక సాయం అందించనున్నట్లు తెలిపారు. నవంబర్ 19వ తేదీ నుంచి రాజీవ్ యువ వికాసం సాయం అందించేలా అవసరమైన ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. స్వయం ఉపాధి కోసం యువతకు ఆర్థిక సహకారం అందించడం ద్వారా వారు తమకు నచ్చిన రంగాల్లో ఉపాధి అవకాశాలను సృష్టించుకునేందుకు అవకాశం లభిస్తుందని రేవంత్ రెడ్డి ప్రభుత్వం భావిస్తోంది. అయితే సాయం పొందేందుకు అర్హతలు, దరఖాస్తు విధానం, ఎంపిక ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను సంబంధిత అధికారులు త్వరలోనే వెల్లడించనున్నట్లు తెలుస్తోంది.మరోవైపు ఇదే సమావేశంలో గురుకుల విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించేందుకు కేంద్రీకృత వంటశాలల ఏర్పాటును వేగవంతం చేయాలని అధికారులను మంత్రులు ఆదేశించారు. విద్యార్థులకు మెరుగైన ఆహారం, విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అదే సమయంలో గురుకులాల్లో చదివి బయటకు వచ్చిన పూర్వ విద్యార్థుల ప్రస్తుత పరిస్థితులపై సమగ్ర అధ్యయనం చేయాలని నిర్ణయించారు. వారి విద్య, ఉద్యోగం, ఉపాధి తదితర అంశాలపై సమాచారం సేకరించి భవిష్యత్ విధానాల రూపకల్పనకు ఉపయోగించుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ఎస్సీ విద్యార్థులకు పోటీ పరీక్షల్లో మెరుగైన అవకాశాలు కల్పించేందుకు స్టడీ సర్కిళ్ల ద్వారా అత్యుత్తమ శిక్షణ అందించాలని ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ నిర్ణయించారు. మరోవైపు ఎస్సీ డిగ్రీ కాలేజీల్లో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఆధునిక కోర్సులను ప్రవేశపెట్టే అంశంపైనా చర్చించారు. మారుతున్న ఉద్యోగ మార్కెట్‌కు అనుగుణంగా విద్యార్థులకు నైపుణ్యాలను అందించడంతో పాటు స్వయం ఉపాధి అవకాశాలను పెంచే విధంగా సంక్షేమ, విద్యా కార్యక్రమాలను అమలు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. రాజీవ్ యువ వికాసం ద్వారా యువతకు అందించే ఆర్థిక సాయం కూడా ఈ లక్ష్యంలో భాగంగా ప్రభుత్వం చెబుతోంది.

# 40 ఎకరాల భూమి శాంతా శ్రీరామ్ సంస్థదే

ఈ నేపథ్యంలోనే శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ సంస్థ హైకోర్టును ఆశ్రయించగా ఆ సంస్థకు అనుకూలంగా తీర్పు రాగా దాన్ని తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. అయితే తాజాగా ఆ పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ సంస్థకు అనుకూలంగా, తెలంగాణ హైకోర్టు తీర్పును సమర్థించింది. ఆ 40 ఎకరాల భూమి శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ సంస్థదేనని తేల్చి చెప్పింది.సికింద్రాబాద్ పరిధిలోని కంటోన్మెంట్ ఏరియాలో లోతుకుంట ప్రాంతంలో ఉన్న 40 ఎకరాల భూమి శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీదే అని సుప్రీంకోర్టు తాజాగా వెల్లడించింది.

ఈ క్రమంలోనే ఆ 40 ఎకరాల భూమి తమదే అంటూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. జస్టిస్ దీపంకర్ దత్త నేతృత్వంలోని సింగిల్ బెంచ్ ఈ తీర్పును వెలువరించింది. అయితే ఆ వివాదాస్పద 40 ఎకరాల భూమి శాంతా శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ కంపెనీదే అని గతంలోనే తెలంగాణ హైకోర్టు తీర్పును ఇచ్చింది.హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ.. అది ప్రభుత్వ భూమి అంటూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేసింది. అయితే ఈ స్పెషల్ లీవ్ పిటిషన్‌ను ఏకంగా 219 రోజుల ఆలస్యంగా దాఖలు చేశారనే కారణంతో జస్టిస్ దీపంకర్ దత్త ధర్మాసనం దాన్ని డిస్మిస్ చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ విషయంలో సరైన సమయంలో తెలంగాణ ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయడంలో విఫలం కావడంతో ఆ పిటిషన్‌ను విచారణకు తీసుకోలేమని స్పష్టం చేసింది.

దీంతో తెలంగాణ హైకోర్టు గతంలో ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించినట్లు అయింది. ఈ క్రమంలోనే సికింద్రాబాద్ ప్రాంతంలోని 40 ఎకరాల వివాదాస్పద భూమి ప్రైవేటుదేనని తేల్చి చెప్పింది. అయితే ఇదే 40 ఎకరాల భూమికి సంబంధించి హైకోర్టు ఇచ్చిన తీర్పును కూడా ఉల్లంఘించి శాంత శ్రీరామ్ కన్‌స్ట్రక్షన్ సంస్థ భూమిలో హైడ్రా అధికారులు కూల్చివేతలకు పాల్పడటంపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది.

తాము ఆదేశాలు ఇచ్చిన తర్వాత కూడా ఎలా కూల్చివేతలు జరుపుతారంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను పదవి నుంచి తొలగించాలని ఆయన స్థానంలో సమర్థవంతమైన అధికారిని నియమించాలంటూ తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ధర్మాసనం ఆదేశాలు కూడా జారీ చేసింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌పై కోర్టు ధిక్కార చర్యలు కూడా తీసుకోవాలని హైకోర్టు సింగిల్ జడ్జి ఆదేశాలు జారీ చేశారు. సింగిల్ జడ్జి ఇచ్చిన ఈ ఉత్తర్వులపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించగా సింగిల్ బెంచ్ ఉత్తర్వులపై డివిజన్ బెంచ్ స్టే ఇచ్చింది.

# తిరుమలలో సాలకట్ల బ్రహ్మోత్సవాలు

మంగళవాయిద్యాల నడుమ అర్చకస్వాములు బంగారు ధ్వజస్తంభంపై గరుడ పటాన్ని ఎగురవేశారు. ఈ ధ్వజారోహణం ద్వారా సకల దేవతలను, అష్టదిక్పాలకులను, సకల జీవరాశులను బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించడం సంప్రదాయం. ఈ కార్యక్రమంతో తొమ్మిది రోజుల ఉత్సవాలకు వైభవంగా తెరలేచింది. మరోవైపు, ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర ప్రభుత్వం తరఫున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించే సంప్రదాయాన్ని పాటించారు. సాయంత్రం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు టీడీపీ నేతలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన కుటుంబ సమేతంగా తిరుమలకు చేరుకున్నారు.

సీఎం వెంట ఆయన అర్ధాంగి నారా భువనేశ్వరి, కుమారుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేశ్, కోడలు నారా బ్రహ్మణి ఉన్నారు. సంప్రదాయ వస్త్రధారణలో ఆలయానికి చేరుకున్న ముఖ్యమంత్రి, ముందుగా బేడి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. ఆ తర్వాత పట్టువస్త్రాలను తలపై ఉంచుకుని, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయంలోకి ప్రవేశించి స్వామివారికి వస్త్రాలు సమర్పించారు. అనంతరం వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రికి అర్చకస్వాములు వేదాశీర్వచనం పలికి, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ పర్యటనలో చంద్రబాబు వెంట టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఇతర నేతలు, అధికారులు ఉన్నాయి. ప్రముఖ సంగీత దర్శకుడు తమన్ కూడా ఈ సందర్భంగా ఆలయంలో కనిపించారు.

# సీఎం రేవంత్‌తో విభేదాల్లేవు, కొండా సురేఖ బర్తరఫ్ బాధించింది

సంతృప్తిగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యకర్తలకు భరోసా కల్పించి, పార్టీకి బలాన్ని చేకూర్చాం అని చెప్పుకొచ్చారు. పార్టీని బూత్ స్థాయి వరకు బలోపేతం చేశాం అని చెప్పుకొచ్చారు.'ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో నా వేవ్‌లెంగ్త్ మ్యాచ్ అయింది. రెండేళ్లు సాఫీగా పార్టీని ముందుకు తీసుకెళ్లాం. చిన్నచిన్న ఇబ్బందులు వచ్చినా అవలీలగా అధిగమించాం. రేవంత్ రెడ్డి, మీనాక్షి నటరాజన్, దీపాదాస్ మున్షీ సహకారంతో పార్టీని నడిపాం అని పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు.

### 17కు 17పార్లమెంట్ స్థానాల్లో గెలుపొందుతాం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే తన లక్ష్యం అని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. డీలిమిటేషన్ లేకపోతే తెలంగాణలో 17కి 17 లోక్‌సభ సీట్లు గెలిపించేందుకు కృషి చేస్తాం అని పేర్కొన్నారు. కుల సర్వేతో తెలంగాణలో నిజమైన సామాజిక న్యాయం జరిగింది అని పీసీసీ చీఫ్ చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీ ఆశయం కుల సర్వేను శాస్త్రీయంగా, సమర్థవంతంగా నిర్వహించిన సీఎం రేవంత్ రెడ్డికి మహేశ్ కుమార్ గౌడ్ ధన్యవాదాలు తెలిపారు. కుల సర్వేను కేంద్రం తొక్కిపెట్టడం దురదృష్టకరం అని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు.

### బీసీలకు 50 శాతం సీట్లు ఇస్తాం

కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం అని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ దీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే దేశవ్యాప్తంగా కుల సర్వే అమలు చేస్తాం అని చెప్పుకొచ్చారు. 'ఏఐసీసీ ఇచ్చిన ప్రతి కార్యక్రమాన్ని బూత్ స్థాయి వరకు తీసుకెళ్లాం. సర్పంచ్ ఎన్నికల్లో 57 శాతం వరకు బీసీలు గెలిచారు. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ పరంగా బీసీలకు 50 శాతం సీట్లు ఇచ్చాం. ఏఐసీసీ ఆదేశాలతో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల ఎంపికలో కొత్త విధానం అమలు చేశాం. ఢిల్లీ నుంచి అబ్జర్వర్లను పంపించి సమీక్షించిన తర్వాత డీసీసీ అధ్యక్షులను ప్రకటించాం'అని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

### సీఎంకు నాకు ఎక్కడా గొడవల్లేవ్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో తనకు ఎక్కడా గొడవ జరగలేదు అని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. పార్టీలో డిఫరెన్స్ ఆఫ్ ఒపీనియన్ సహజమే అని చెప్పుకొచ్చారు. తమ మధ్య గ్యాప్ ఉందని పత్రికల్లో వస్తుంది కానీ గొడవ లేదు అని చెప్పుకొచ్చారు.అదంతా మీడియా సృష్టే అని చెప్పుకొచ్చారు.సీఎం రేవంత్ రెడ్డితో అభిప్రాయ భేదాలు వచ్చినా సాయంత్రానికే సరిచేసుకున్నాం అని వెల్లడించారు. పార్టీ విషయంలో సీఎం రేవంత్ రెడ్డి ఎప్పుడూ జోక్యం చేసుకోలేదు అని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలియజేశారు.

### సురేఖ బర్తరఫ్ బాధించింది

మరోవైపు కొండా సురేఖ బర్తరఫ్‌పైనా మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు.ఒక బీసీ మంత్రిని తొలగించినప్పుడు తాను కూడా బాధపడ్డా అని చెప్పుకొచ్చారు. సురేఖను తొలగించడానికి కారణాలు మీకు తెలుసు అని చెప్పుకొచ్చారు. ఏఐసీసీ నిర్ణయం మేరకే సురేఖపై చర్యలు తీసుకున్నాం అని తెలిపారు. క్రమశిక్షణ తప్పి హద్దు దాటితే ఎవరిపైనా చర్యలు తప్పవు అని హెచ్చరించారు. క్రమశిక్షణ విషయంలో కఠినంగా వ్యవహరించాలని ఏఐసీసీ నిర్ణయించింది అని మహేశ్ కుమార్ గౌడ్ చెప్పుకొచ్చారు.

### ఈ నెలాఖరులోగా వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకం పూర్తి

'నా అధ్యక్షతన కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో విజయం సాధించాం. రెండేళ్ల ప్రయాణం ఎలాంటి లోటుపాట్లు లేకుండా సాగింది. పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాలను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాం'అని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. నెలాఖరులోపు వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకం జరుగుతుందని చెప్పుకొచ్చారు. వీలైనంత త్వరగా వర్కింగ్ ప్రెసిడెంట్ల నియామకం పూర్తి చేస్తాం అని అన్నారు. సొసైటీ నియామకాల్లో మండల అధ్యక్షుల నిర్ణయానికే ప్రాధాన్యం ఉంటుంది అని అన్నారు. కార్యకర్తల విషయంలో ఎమ్మెల్యేలు కొంత ఇబ్బంది పెట్టినా మండల అధ్యక్షుల అభిప్రాయానికి ప్రాధాన్యం ఇచ్చాం అని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. మండల అధ్యక్షుల నిర్ణయానికి ప్రాధాన్యంపై ఏఐసీసీ నుంచి ప్రత్యేక అనుమతి తీసుకున్నట్లు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు.

### ఎమ్మెల్యే టికెట్ల విషయంలో డీసీసీ అధ్యక్షుల అభిప్రాయం కీలకం

మరోవైపు ఎమ్మెల్యే టికెట్ల విషయంలో డీసీసీ అధ్యక్షుల అభిప్రాయం అత్యంత కీలకం అని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వెల్లడించారు. పీఏసిలో ఏమ్మెల్యే టికెట్ చర్చకు ముందు డీసీసీ అధ్యక్షుడి అభిప్రాయం తీసుకుంటాం అని చెప్పుకొచ్చారు. ఏమ్మెల్యేగా పోటీ చేయాలనుకునే వారు తప్పనిసరిగా డీసీసీ అధ్యక్షుడిని కలవాల్సిందే అని చెప్పుకొచ్చారు. నామినేటెడ్ పదవుల భర్తీలోనూ డీసీసీ అధ్యక్షుల అభిప్రాయం తీసుకుంటున్నాం అని పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యుల కొరత

ఇటీవల శాసనమండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ కుమార్ అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం ఇచ్చిన సమాధానంలో ఈ వివరాలు వెల్లడయ్యాయి. రాష్ట్రంలో మొత్తం 203 ప్రభుత్వ ఆస్పత్రులు ఉన్నాయి. వీటిలో 35 బోధన ఆస్పత్రులు, 16 ప్రత్యేక ఆస్పత్రులు, 152 సెకండరీ గ్రేడ్ హాస్పిటల్స్ ఉన్నాయి. ఈ ఆస్పత్రులన్నింటిలో కలిపి 36,984 పడకల సామర్థ్యం ఉంది. అయితే వైద్యుల పోస్టుల భర్తీలో అన్ని స్థాయిల్లోనూ ఒకే పరిస్థితి లేదు.

ముఖ్యంగా జిల్లా స్థాయిలో ప్రజలకు ప్రధాన వైద్య సేవలు అందించే ద్వితీయ శ్రేణి ఆస్పత్రుల్లో ఖాళీల భారం ఎక్కువగా ఉంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు అనుబంధంగా ఉన్న బోధనాసుపత్రుల్లో 3,423 మంజూరైన వైద్యుల పోస్టులకు 758 ఖాళీగా ఉన్నాయి. అంటే దాదాపు 22 శాతం పోస్టులు భర్తీ కావాల్సి ఉంది. అదే సమయంలో ద్వితీయ శ్రేణి ఆస్పత్రుల్లో 4,092 పోస్టులకు ఏకంగా 1,480 ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ దాదాపు 36 శాతం ఖాళీలు ఉన్నాయి.జిల్లా ఆస్పత్రుల్లో డాక్టర్ల కొరత పెరగడం వల్ల అందుబాటులో ఉన్న డాక్టర్లపై పని భారం మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా జిల్లా స్థాయిలోనే అందాల్సిన వైద్య సేవలు సక్రమంగా అందకపోతే రోగులు హైదరాబాద్ వంటి నగరాల్లోని పెద్ద ఆస్పత్రులను ఆశ్రయించే పరిస్థితి ఏర్పడుతుందని పేర్కొంటున్నారు.

జిల్లా ఆస్పత్రుల్లో సాధారణ వైద్యుల పోస్టులతో పాటు సర్జన్లు, గైనకాలజిస్టులు, అనస్థీషియాలజిస్టుల వంటి నిపుణుల పోస్టులను భర్తీ చేయడం అత్యవసరమని వైద్య నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం ఏడాదికి సుమారు 250 నుంచి 300 మంది వైద్యులను మాత్రమే ప్రభుత్వం భర్తీ చేస్తుందని ఇలా చేస్తే మొత్తం ఖాళీలను భర్తీ చేయడానికి మరికొన్ని సంవత్సరాలు పట్టే అవకాశం ఉంటుందని అంటున్నారు. ఇలా అయితే కష్టమే అని పేద రోగులకు సరైన సెకండరీ గ్రేడ్ ఆస్పత్రుల్లో వైద్యుల ఖాళీల విషయంలో జిల్లాల మధ్య గణనీయమైన తేడాలు కనిపిస్తున్నాయని నిపుణులు అంటున్నారు.

నిజామాబాద్, వికారాబాద్ జిల్లాల్లో 55 శాతానికి పైగా పోస్టులు ఖాళీగా ఉండగా ఖమ్మం, కామారెడ్డి జిల్లాల్లో సుమారు 46 శాతం ఖాళీలు ఉన్నాయి. హైదరాబాద్‌లో 475 మంజూరైన పోస్టులకు 148 ఖాళీగా ఉండగా 327 మంది డాక్టర్లు సేవలందిస్తున్నారు. బోధనాసుపత్రుల్లోనూ కొన్ని చోట్ల పరిస్థితి తీవ్రంగా ఉందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

ప్రభుత్వ మెడికల్ కాలేజ్ ఆసిఫాబాద్‌లో దాదాపు 73 శాతం వైద్యుల పోస్టులు ఖాళీగా ఉండగా భద్రాద్రి కొత్తగూడెం ప్రభుత్వ మెడికల్ కాలేజీలో 55 శాతానికి పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మరోవైపు గాంధీ హాస్పిటల్, ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఖాళీలు లేకపోవడం, మంజూరైన సంఖ్యకు మించి డాక్టర్లు పనిచేస్తుండటం గమనార్హం.

## బానోత్ శంకర్ నాయక్ అధ్యక్షతన
# బీఆర్ఎస్ గిరిజన నాయకుల సమావేశం

మహబూబాబాద్ మహబూబాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ గిరిజన నాయకుల సమావేశం మాజీ శాసనసభ్యులు బానోత్ శంకర్ నాయక్ అధ్యక్షతన మహబూబాబాద్ లో జరిగింది.. ఈ సమావేశానికి ముఖ్య అతిధిగా మాజీమంత్రి సత్యవతిరాథోడ్ హాజరయ్యారు.

తండాలను ప్రత్యేక గ్రామపంచాయతీలను చేయడంతోపాటు, గిరిజనులకు రిజర్వేషన్ లు పెంచిన గిరిజనబంధు కేసిఆర్ అని, ఈనెల 17న తండా తండాలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకాలు చేయాలని తీర్మానించారు.

ఈ..సమావేశంలో మహబూబాబాద్ నియోజకవర్గంలోని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ అధ్యక్షులు, కౌన్సిలర్లు, గిరిజన సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటీసీలు, మాజీకౌన్సిలర్లు, మాజీప్రజ ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ గిరిజన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పుష్పాల పరిమళంలో తిరుమల వైభవం

**బ్రహ్మోత్సవ వేళ పూలవనంగా మారిన ఏడుకొండలు**

**వర్ణవర్ణాల పుష్పాలతో అద్భుత నమూనాలు..**

**అడుగడుగునా కనువిందు**

**ప్రకృతి సోయగానికి ఆధ్యాత్మిక శోభ..**

**భక్తుల మదిలో చెరగని ముద్ర**

(తోట వెంకట్- ప్రజా ప్రశ్న ఏపీ స్టేట్ బ్యూరో)











తెల్లవారుజామునే కొండపైకి అడుగుపెట్టగానే ఓ విభిన్నమైన అనుభూతి. గాలిలో పూల పరిమళం.. చెవుల్లో గోవింద నామస్మరణ.. కళ్లముందు పచ్చని కొండలు.. వాటి మధ్య రంగురంగుల పుష్పాలతో తీర్చిదిద్దిన ఆకృతులు. ఒక్కో మలుపు దాటుతున్న కొద్దీ మరో అందం. ఒక్కో అడుగు ముందుకు వేస్తున్న కొద్దీ మరో పుష్ప కళాఖండం. ఇదంతా కలలా అనిపించినా.. నిజమే. శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల వేళ తిరుమల పూలవనంగా మారిపోయింది.ఏడుకొండలపై నిత్యం పచ్చదనంతో అలరారే తిరుమలకు బ్రహ్మోత్సవాలు ప్రత్యేక శోభను తీసుకొస్తాయి. శ్రీవారి ఉత్సవాలు ఎంత వైభవంగా జరుగుతాయో.. వాటికి తగ్గట్టుగానే తిరుమల పరిసరాలను అలంకరించడంలో టీటీడీ ఉద్యానవన విభాగం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది. వివిధ రకాల పుష్పాలు, మొక్కలు, సహజసిద్ధమైన అలంకరణ సామగ్రితో రూపొందించిన ఆకృతులు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఆలయంలో ఆధ్యాత్మిక అనుభూతి కలగడం సహజం. అయితే ఈసారి ఆ అనుభూతికి ప్రకృతి అందం కూడా తోడైంది. పుష్పం.. పచ్చదనం.. పరిమళం.. భక్తి.. కళ.. అన్నీ ఒకే చోట కలిసినట్లుగా తిరుమల కనిపిస్తోంది.

### అడుగడుగునా ఓ కళాఖండం

బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలలో చేపట్టిన పుష్పాలంకరణలో ప్రత్యేకత కనిపిస్తోంది. పూలను కేవలం వరుసలుగా అమర్చడం కాకుండా.. వాటిని కళాత్మకంగా వినియోగిస్తూ వివిధ ఆకృతులను తీర్చిదిద్దారు. రంగుల సమన్వయంతో రూపొందించిన నమూనాలు దూరం నుంచే చూపరులను ఆకర్షిస్తున్నాయి.ఎరుపు, పసుపు, తెలుపు, గులాబీ, నారింజ తదితర రంగుల్లోని పుష్పాలు ఒకదానితో ఒకటి కలిసిపోయి అద్భుతమైన దృశ్యాన్ని ఆవిష్కరిస్తున్నాయి. పచ్చని ఆకుల మధ్య రంగురంగుల పూలను అమర్చడంతో ప్రతి నమూనా ప్రత్యేకంగా కనిపిస్తోంది.ఒకచోట పూలతో అందమైన ఆకృతి కనిపిస్తే.. మరోచోట పచ్చని మొక్కల మధ్య రంగుల పుష్పాలు దర్శనమిస్తున్నాయి. ఇంకొకచోట సహజసిద్ధమైన వాతావరణాన్ని ప్రతిబింబించేలా అలంకరణను తీర్చిదిద్దారు. అందుకే భక్తులు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లే కొద్దీ కొత్తదనాన్ని ఆస్వాదిస్తున్నారు.

### పూలతో పలికిన భక్తి భావం

తిరుమలలో పుష్పాలకు ప్రత్యేకమైన స్థానం ఉంది. స్వామివారి అలంకరణలో పూలకు ఉన్న ప్రాధాన్యం అందరికీ తెలిసిందే. అలాంటి పుష్పాలతోనే బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమల పరిసరాలను అలంకరించడం భక్తులకు మరింత ఆహ్లాదాన్ని పంచుతోంది.పూల అందాన్ని చూస్తున్నప్పుడు అది కేవలం అలంకరణగా అనిపించదు. శ్రీవారి సన్నిధిలో ప్రకృతి కూడా తన వంతుగా పూజ చేస్తున్నట్లుగా అనిపిస్తుంది. పుష్పాల రంగులు కళ్లకు కనువిందు చేస్తే.. వాటి పరిమళం మనసుకు ప్రశాంతతను అందిస్తోంది.గోవింద నామస్మరణతో మార్మోగే తిరుమలలో పుష్పాల పరిమళం మరింత ఆధ్యాత్మిక వాతావరణాన్ని తీసుకొస్తోంది. భక్తులు కాసేపు ఆగి పుష్ప నమూనాలను వీక్షిస్తూ.. వాటి వద్ద ఫొటోలు తీసుకుంటూ.. ఆ అందాలను తమ జ్ఞాపకాల్లో పదిలం చేసుకుంటున్నారు.

### వాహన సేవలకు అదనపు శోభ

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో వాహన సేవలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది. ప్రతి రోజూ స్వామివారు ఒక్కో వాహనంపై మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారు. ఆ సమయంలో మాడ వీధులు భక్తులతో కిక్కిరిసిపోతాయి.వాహన సేవలు జరిగే ప్రాంతాలు, ప్రధాన కూడళ్ల పరిసరాల్లో చేపట్టిన పుష్పాలంకరణ ఈ వైభవానికి మరింత శోభను తెచ్చింది. స్వామివారి వాహన సేవ ఒకవైపు.. పూలతో అలంకరించిన పరిసరాలు మరోవైపు.. భక్తులకు కనువిందు చేస్తున్నాయి.రాత్రివేళ విద్యుత్ దీపాల వెలుగుల్లో పుష్పాలంకరణ మరింత ఆకర్షణీయంగా కనిపిస్తోంది. పూల రంగులు, దీపాల వెలుగులు కలగలిసి తిరుమల పరిసరాలకు మరో కొత్త రూపాన్ని తీసుకొస్తున్నాయి.

### ఒక్కో పువ్వు వెనుక ఎంతో శ్రమ

భక్తుల కళ్లకు కనిపించేది అందమైన పూల అలంకరణ మాత్రమే. కానీ ఆ అందం వెనుక ఉద్యానవన విభాగం సిబ్బంది చేసిన కృషి ఎంతో ఉంది.ఒక పుష్ప నమూనా రూపొందించాలంటే ముందుగా ఆలోచన.. ఆ తర్వాత నమూనా రూపకల్పన.. దానికి సరిపోయే పుష్పాల ఎంపిక.. రంగుల సమన్వయం.. పూలను సేకరించడం.. వాటిని నిర్దిష్ట ఆకృతిలో అమర్చడం.. చివరకు అలంకరణను నిరంతరం సంరక్షించడం వంటి అనేక దశలు ఉంటాయి.

### బ్రహ్మోత్సవాల రోజుల్లో భక్తుల రద్దీ

ఎక్కువగా ఉండటంతో పుష్పాలంకరణకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సి ఉంటుంది. పూల తాజాదనం, మొక్కల పచ్చదనం, నమూనాల ఆకర్షణ కొనసాగేందుకు నిరంతరం శ్రమిస్తున్నారు.భక్తులకు కొన్ని క్షణాల అందాన్ని అందించేందుకు.. తెరవెనుక ఎన్నో గంటల శ్రమ సాగుతోంది.తిరుమలలో ప్రకృతి పండుగతిరుమల అసలే ప్రకృతి ఒడిలోని ఆధ్యాత్మిక క్షేత్రం. ఏడుకొండలు, పచ్చని చెట్లు, చల్లని గాలులు, పక్షుల కిలకిలారావాలు.. ఇవన్నీ తిరుమల సహజ సౌందర్యానికి ప్రతీకలు.దీనికి బ్రహ్మోత్సవాల పుష్పాలంకరణ తోడవడంతో ప్రకృతి మరో రూపంలో దర్శనమిస్తోంది. కొండల పచ్చదనానికి పూల రంగులు జతయ్యాయి. నిశ్శబ్దంగా ఉండే ప్రకృతి వాతావరణానికి భక్తుల సందడి తోడైంది. ఆధ్యాత్మికతకు కళాత్మకత కలిసింది.అందుకే ఈసారి తిరుమలకు వచ్చిన భక్తులకు శ్రీవారి దర్శనం మాత్రమే కాదు.. తిరుమల అందాల దర్శనం కూడా ఒక ప్రత్యేక అనుభూతిగా మారింది.

### చిన్నారుల కళ్లలో పెద్ద ఆశ్చర్యం

తిరుమలకు వచ్చే ప్రతి కుటుంబంలోనూ చిన్నారులకు ఈ పుష్పాలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. రంగురంగుల పూలను చూసి పిల్లలు ఆసక్తిగా వాటిని గమనిస్తున్నారు. వివిధ ఆకృతుల వద్ద నిలబడి తల్లిదండ్రులతో కలిసి ఫొటోలు దిగుతున్నారు.పెద్దలకు ఆధ్యాత్మికత ఎంత ఆనందాన్నిస్తుందో.. చిన్నారులకు ఈ పుష్పాలంకరణ ప్రకృతి, కళల పట్ల అంతే ఆసక్తిని కలిగిస్తోంది. ఒక తరం చూసిన అందాన్ని మరో తరం కూడా గుర్తుంచుకునేలా ఈ అలంకరణలు నిలుస్తున్నాయి.

### భక్తుల జ్ఞాపకాల్లో ఓ రంగుల పండుగ

తిరుమల యాత్ర అంటే చాలామందికి జీవితాంతం గుర్తుండిపోయే అనుభవం. శ్రీవారి దర్శనం.. లడ్డూ ప్రసాదం.. వాహన సేవలు.. గోవింద నామస్మరణ.. ఇవన్నీ ఆ యాత్ర జ్ఞాపకాల్లో భాగమవుతాయి.

ఈ బ్రహ్మోత్సవాలకు వచ్చిన భక్తుల జ్ఞాపకాల్లో ఈసారి పుష్పాలంకరణ కూడా ప్రత్యేక స్థానం సంపాదిస్తోంది.కొండపైకి చేరుకున్న క్షణం నుంచి తిరుగు ప్రయాణం వరకు కనిపించే పచ్చదనం, పుష్పాల అందాలు.. భక్తుల కెమెరాల్లోనూ, మనసుల్లోనూ నిలిచిపోతున్నాయి. కొందరికి అవి ఫొటోలు.. మరికొందరికి వీడియోలు.. ఇంకొందరికి పిల్లలతో పంచుకున్న మధుర జ్ఞాపకాలు. కానీ ప్రతి ఒక్కరికీ వాటి వెనుక ఒకే అనుభూతి---తిరుమలలో చూసిన అందం.తరతరాలకు చెప్పుకునే తిరుమలకొన్ని అలంకరణలు చూసిన వెంటనే మరిచిపోతాం. మరికొన్ని మాత్రం కాలం గడిచినా జ్ఞాపకాల్లో నిలిచిపోతాయి. శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలలో కనిపిస్తున్న ఈ పుష్పాలంకరణ అలాంటి జ్ఞాపకంగా నిలవాలన్నదే భక్తుల ఆకాంక్ష.ఈరోజు తల్లిదండ్రులతో కలిసి తిరుమలకు వచ్చిన చిన్నారి.. రేపు పెద్దయ్యాక తన పిల్లలను తీసుకుని తిరుమలకు వచ్చినప్పుడు, "నేను చిన్నప్పుడు కూడా ఇక్కడ ఇలాంటి బ్రహ్మోత్సవాలు చూశాను" అని చెప్పుకునేంతగా ఈ దృశ్యాలు మనసులో ముద్ర పడుతున్నాయి.ఒక తరం చూసిన దృశ్యం.. మరో తరానికి కథగా మారుతుంది. ఆ కథలో శ్రీవారి బ్రహ్మోత్సవాల వైభవం ఉంటుంది. ఆ కథలో గోవింద నామస్మరణ ఉంటుంది. ఆ కథలో మాడ వీధుల సందడి ఉంటుంది. వాటన్నింటి మధ్య పూల పరిమళంతో నిండిన తిరుమల కూడా ఉంటుంది.

### శ్రీవారి సన్నిధిలో ప్రకృతి సమర్పించిన పుష్పాంజ

బ్రహ్మోత్సవాలు శ్రీవారికి జరిగే మహోత్సవం. భక్తులు తమ శక్తి మేరకు స్వామివారికి సేవ చేస్తారు. ఎవరో అన్నదానం చేస్తారు.. మరెవరో భక్తులకు సేవలందిస్తారు.. ఇంకొందరు తమ కళను సమర్పిస్తారు.తిరుమల ఉద్యానవన విభాగం మాత్రం పూలతోనే తన సేవను సమర్పిస్తోంది.ఒక్కో పువ్వును జాగ్రత్తగా అమర్చి.. ఒక్కో మొక్కను ప్రేమగా పెంచి.. ఒక్కో ఆకృతిని కళాత్మకంగా తీర్చిదిద్ది.. శ్రీవారి సన్నిధిని మరింత అందంగా తీర్చిదిద్దుతోంది.అందుకే ఈ పుష్పాలంకరణను కేవలం అలంకరణగా చూడలేం. ఇది ఒక సేవ. ఇది ఒక కళ. ఇది ప్రకృతికి అర్పించిన నివాళి. ఇది శ్రీవారి బ్రహ్మోత్సవ వైభవానికి జోడించిన మరో ఆధ్యాత్మిక రంగు.పూలు వాడిపోవచ్చు.. అలంకరణలు తొలగిపోవచ్చు.. బ్రహ్మోత్సవాలు ముగిసిపోవచ్చు. కానీ ఈ ఏడాది తిరుమల పుష్ప వైభవం భక్తుల జ్ఞాపకాల్లో మాత్రం చిరకాలం పరిమళిస్తూనే ఉంటుంది.ఏడుకొండలపై

## జగిత్యాల చైతన్య డైరీ ఫామ్ పాల ప్యాకెట్‌లో
# గమ్ వంటి అనుమానాస్పద పదార్థం

**జగిత్యాలలో 20 పాల కేంద్రాలపై**

**ఫుడ్ సేఫ్టీ అధికారుల ఆకస్మిక తనిఖీలు**



జగిత్యాల పట్టణంలోని పలు పాల విక్రయ కేంద్రాలపై ఫుడ్ సేఫ్టీ అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష నేతృత్వంలో ఈ సోదాలు కొనసాగాయి. జగిత్యాల పట్టణంలోని వాణి నగర్‌లో ఉన్న చైతన్య డెయిరీ (పాల కేంద్రం) లో కల్తీ పాలు విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఇటీవల తీవ్ర కలకలం రేపాయి. వాణి నగర్‌కు చెందిన లక్ష్మణ్ అనే వినియోగదారుడు చైతన్య డెయిరీ నుండి కొనుగోలు చేసిన పాల ప్యాకెట్‌ను ఫ్రిజ్‌లో పెట్టి, ఆ తర్వాత తీసి చూడగా ఆ పాలు పూర్తిగా జిగురు (గమ్/జెల్) రూపంలోకి మారిపోయాయి.

వినియోగదారుడు చేసిన ఫిర్యాదు జిల్లావ్యాప్తంగా కలకలం రేపింది. ఈ ఘటనపై స్పందించిన అధికారులు చైతన్య డైరీ ఫారంతో పాటు పట్టణంలోని పలు ప్రధాన పాల విక్రయ కేంద్రాలలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.

### ల్యాబ్‌కు పాలు, నమూనాలు..

తనిఖీల సందర్భంగా వివిధ సెంటర్ల నుంచి పాల శాంపిల్స్‌ను సేకరించిన అధికారులు, వాటిని నాణ్యతా పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోని ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్‌కు పంపించారు.

### చట్టపరమైన చర్యలు తప్పవు..





ఈ సందర్భంగా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, పాల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని స్పష్టం చేశారు. చైతన్య డైరీ పాలపై వచ్చిన ప్రత్యేక ఫిర్యాదు దృష్ట్యా అక్కడ నమూనాలు సేకరించామని తెలిపారు. ల్యాబ్ నివేదికల్లో నాణ్యతా లోపాలు ఉన్నట్లు తేలితే లేదా నిబంధనలు ఉల్లంఘించినట్లు రుజువైతే సంబంధిత డైరీలను సీజ్ చేయడంతో పాటు, నిర్వాహకులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# టీటీడీ ఉద్యోగుల హౌస్‌సైట్లకు మోక్షం!

**పరిష్కారం దిశగా కీలక అడుగు..**

**సీఎం చంద్రబాబు సానుకూల నిర్ణయం**

**రూ.230 కోట్ల వ్యయంపై సబ్‌కమిటీ ప్రతిపాదనకు**

**పాలకమండలి ఆమోదం**

**బ్రహ్మోత్సవాల తర్వాత కార్యరూపానికి చర్యలు**

**: చైర్మన్ బీఆర్ నాయుడు**



తిరుమల(ప్రశ్న న్యూస్)కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న టీటీడీ ఉద్యోగుల హౌస్‌సైట్ల సమస్య పరిష్కారం దిశగా కీలక అడుగు పడింది. ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సానుకూలంగా స్పందించి, వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించినట్లు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. బ్రహ్మోత్సవాలు ముగిసిన వెంటనే ఈ అంశాన్ని కార్యరూపంలోకి తీసుకెళ్లేందుకు చర్యలు ప్రారంభిస్తామని వెల్లడించారు.మంగళవారం తిరుమలలోని తన క్యాంపు కార్యాలయంలో హౌస్‌సైట్ల అంశంపై పాలకమండలి సభ్యులు, ఉద్యోగ సంఘాల నాయకులతో చైర్మన్ సమావేశమయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఉద్యోగుల హౌస్‌సైట్ల కోసం సుమారు రూ.230 కోట్ల వ్యయం అవుతుందని పరిశీలించిన తర్వాత అనుభవజ్ఞులతో ప్రత్యేక సబ్‌కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కమిటీ సమగ్రంగా పరిశీలించి ఇచ్చిన ప్రతిపాదనను పాలకమండలి ఏకగ్రీవంగా ఆమోదించిందన్నారు.

## సీఎం ఆదేశాలతో వేగం

బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక అందించే సందర్భంగా ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసినప్పుడు ఉద్యోగుల హౌస్‌సైట్ల అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు చైర్మన్ తెలిపారు. సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని సీఎం సూచించడంతో పాటు, టీటీడీ ఉద్యోగుల కోసం ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని స్పష్టంగా ఆదేశించారని చెప్పారు. దీనికి పూర్తి సహకారం అందిస్తామని సీఎం హామీ ఇచ్చినట్లు తెలిపారు.ప్రస్తుతం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లలో అధికారులు, సిబ్బంది నిమగ్నమై ఉన్నందున.. ఉత్సవాలు ముగిసిన వెంటనే హౌస్‌సైట్ల కార్యక్రమంపై చర్యలు ప్రారంభిస్తామని చైర్మన్ స్పష్టం చేశారు.సమావేశంలో టీటీడీ పాలకమండలి సభ్యులు పనబాక లక్ష్మి, జ్యోతుల నెహ్రూ, ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు. హౌస్‌సైట్ల సమస్య పరిష్కారానికి చొరవ తీసుకున్న టీటీడీ పాలకమండలికి, సీఎం చంద్రబాబుకు ఉద్యోగ సంఘాల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

# భక్తులకు అసౌకర్యం కలగొద్దు

**ప్రసాదం నుంచి అన్నప్రసాదం వరకు నాణ్యత, వేగంపై దృష్టి**

**లడ్డూ కౌంటర్ల వద్ద క్యూలు తగ్గించాలి..**

**రద్దీకి అనుగుణంగా అదనపు కౌంటర్లు**

**శ్రీశైల దేవస్థానంలో ఈఓ ఎం. శ్రీనివాసరావు ఆకస్మిక తనిఖీ**



శ్రీశైలం(ప్రశ్న న్యూస్) శ్రీశైలం క్షేత్రానికి వచ్చే భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల్లో సేవలను మెరుగుపరచాలని దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం ఆయన దేవస్థానంలోని పలు విభాగాలను ఆకస్మికంగా పరిశీలించారు. ఉచిత ప్రసాద వితరణ, లడ్డూ ప్రసాద విక్రయ కేంద్రాలు, అన్నప్రసాద వితరణ విభాగాలను తనిఖీ చేశారు.

## ప్రతి భక్తుడికీ ప్రసాదం

అమ్మవారి ఆలయం వెనుకభాగంలో కొనసాగుతున్న ఉచిత ప్రసాద వితరణలో ఎలాంటి అంతరాయం ఉండకూడదని ఈఓ స్పష్టం చేశారు. దర్శనాలు ప్రారంభమైనప్పటి నుంచి ముగిసే వరకు ప్రసాద వితరణ కొనసాగించాలని సూచించారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్న ప్రతి భక్తుడికీ ఉచిత ప్రసాదం అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.
ఈ సందర్భంగా ప్రసాద వితరణ కేంద్రం వద్ద పలువురు భక్తులతో ఈఓ నేరుగా మాట్లాడి దేవస్థానం అందిస్తున్న సౌకర్యాలపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

## క్యూలు పెరగకుండా చూడాలి

లడ్డూ ప్రసాద విక్రయ కేంద్రాలను పరిశీలించిన ఈఓ.. భక్తులు ఎక్కువసేపు క్యూలైన్లలో వేచి ఉండకుండా త్వరితగతిన ప్రసాదాలు అందించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రద్దీ ఎక్కువగా ఉన్న సమయాల్లో అవసరాన్ని బట్టి అదనపు కౌంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తుల రాకపోకలను ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని పర్యవేక్షకులకు స్పష్టం చేశారు.

## అన్నప్రసాదంపై ఆరా

అన్నప్రసాద వితరణ విభాగాన్ని పరిశీలించిన ఈఓ.. ప్రతిరోజూ భక్తులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకోవాలని అధికారులను ఆదేశించారు. వంటకాల రుచి, నాణ్యత, వడ్డన విధానంపై భక్తుల నుంచి సూచనలు స్వీకరించాలని చెప్పారు.
నిర్దేశిత సమయానికి అన్నప్రసాద వితరణ ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వితరణలో శివసేవకుల సేవలను విస్తృతంగా వినియోగించుకోవాలని, వారికి ముందుగానే వడ్డన తదితర అంశాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

## వంటకాల్లో నాణ్యత తప్పనిసరి

అన్నప్రసాదాల తయారీలో తాజా కూరగాయలను మాత్రమే వినియోగించాలని ఈఓ సూచించారు. రోజువారీ వంటకాల్లో వివిధ రకాల కూరగాయలను ఉపయోగించి రుచికరంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.ప్రతి వంటకం ప్రతి భక్తుడికీ చేరేలా పర్యవేక్షణ ఉండాలని, అన్నప్రసాద హాళ్లను సిబ్బంది నిరంతరం పరిశీలించాలని ఆదేశించారు. వంటశాల, అన్నప్రసాద వితరణ హాళ్లు, పరిసర ప్రాంగణాల్లో పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.
భక్తుడికి అందే ప్రసాదం నుంచి అన్నప్రసాదం వరకు ప్రతి దశలో నాణ్యత, వేగం, పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఈఓ చేసిన ఆకస్మిక తనిఖీ సందర్భంగా అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు.

# మత్తు మాయలో.. బాలికపై దారుణం

**- నెలల తరబడి లైంగిక వేధింపులు,- ఎనిమిది మంది నిందితులపై ఆరోపణలు**

**- మత్తు పదార్థాలకు బానిస చేసి పలుచోట్ల అఘాయిత్యానికి పాల్పడ్డారని పోలీసుల వెల్లడి**

**- తప్పించుకుని ఇంటికి చేరిన బాలిక,- కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో వెలుగులోకి ఘటన**



హైదరాబాద్(ప్రశ్న న్యూస్) చదువుకోవాల్సిన వయసులో ఓ ఇంటర్ విద్యార్థినిని మత్తు పదార్థాలకు బానిస చేసి, పలువురు యువకులు లైంగిక దాడులకు పాల్పడ్డారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. హైదరాబాద్ పరిధిలోని అల్వాల్ ప్రాంతంలో వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాలికకు పరిచయమైన వ్యక్తులే ఆమెను మత్తు పదార్థాలకు అలవాటు చేసి, పలుచోట్లకు తీసుకెళ్లి అఘాయిత్యాలకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు.
బాధితురాలు మైనర్ కావడంతో ఆమె గుర్తింపును పోలీసులు గోప్యంగా ఉంచారు. ఘటనకు సంబంధించి పలువురు వ్యక్తుల పాత్రపై దర్యాప్తు కొనసాగుతోందని, నిందితుల కోసం గాలింపు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.

## పదో తరగతిలో పరిచయం..

పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. మచ్చబొల్లారానికి చెందిన 16 ఏళ్ల బాలిక ప్రస్తుతం ఇంటర్ చదువుతోంది. ఆమె పదో తరగతిలో ఉన్న సమయంలో జెర్రీ వరుణ్ అనే యువకుడితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయాన్ని ఆసరాగా చేసుకున్న అతడు కొన్ని నెలల క్రితం బాలికకు మత్తు పదార్థం కలిపిన చాక్లెట్ ఇచ్చి తన కారులోకి తీసుకెళ్లినట్లు, అక్కడ ఆమెపై లైంగిక దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు.ఈ ఘటన అనంతరం బాలికకు మరికొందరు వ్యక్తులతో పరిచయాలు ఏర్పడినట్లు విచారణలో వెల్లడైందని పోలీసులు చెబుతున్నారు. ఒక్కసారి జరిగిన ఘటనతో ఆగకుండా పలువురు యువకులు ఆమెను లక్ష్యంగా చేసుకున్నారని ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు పేర్కొన్నారు.

## మత్తు పదార్థాలకు అలవాటు చేసి..

జెర్రీ వరుణ్ ద్వారా రొమాల వరుణ్ అనే వ్యక్తి బాలికకు పరిచయమైనట్లు పోలీసులు తెలిపారు. అతడు మద్యం, సిగరెట్లు, గంజాయి వంటి మత్తు పదార్థాలను ఆమెకు అలవాటు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం ఆమెను కొంపల్లిలోని ఓ ప్రాంతానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు పోలీసులు పేర్కొన్నారు.ఇదే సమయంలో డేవిడ్ వరుణ్ అనే మరో వ్యక్తి బాలికకు సామాజిక మాధ్యమం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైనట్లు సమాచారం. అతడు కూడా బాలికను మద్యం తాగించి అసభ్యంగా ప్రవర్తించినట్లు పోలీసులు వెల్లడించారు.ఈ పరిణామాలతో బాలిక మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురైనట్లు తెలుస్తోంది. ఇంట్లో ఆమె ప్రవర్తనలో మార్పులు కనిపించడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు.

## ఇంట్లో మందలించడంతో బయటకు..

ఈ నెల 9న బాలికను ఆమె తండ్రి మందలించినట్లు పోలీసులు తెలిపారు. దీంతో మనస్తాపానికి గురైన బాలిక ఇంటి నుంచి బయటకు వెళ్లి బొల్లారం రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. అక్కడ నీరజ్ అనే వ్యక్తి ఆమెకు పరిచయమైనట్లు పోలీసులు పేర్కొన్నారు.నీరజ్ తన స్నేహితుడు విక్కీని అక్కడికి పిలిపించినట్లు తెలిపారు. అనంతరం ఇద్దరూ బాలికకు మత్తు పదార్థాలు ఇచ్చి ఆమెపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటన తర్వాత కూడా బాలికను వదిలిపెట్టకుండా విక్కీ తన పరిచయస్తుడైన నిఖిల్ వద్దకు తీసుకెళ్లినట్లు పోలీసులు చెబుతున్నారు.

## ఓయో గదికి తీసుకెళ్లి..

పోలీసుల కథనం ప్రకారం.. విక్కీ, నిఖిల్ కలిసి బాలికను దూలపల్లిలోని ఓయో గదికి తీసుకెళ్లారు. అక్కడ నిఖిల్‌తో పాటు అతడి స్నేహితులు కూడా బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.ఈ ఘటనతో బాలిక తీవ్ర భయాందోళనకు గురైనట్లు పోలీసులు తెలిపారు. ఆ రాత్రి ఆమెను విక్కీ తన ఇంటికి తీసుకెళ్లి బయటకు వెళ్లకుండా అడ్డుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మైనర్ బాలికను ఆమె ఇష్టానికి వ్యతిరేకంగా నిర్బంధించిన అంశంపైనా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## మళ్లీ స్టేషన్‌కు.. అడ్డగించి..

మరుసటి రోజు, అంటే ఈ నెల 10న, విక్కీ ఇంటి నుంచి బాలిక తప్పించుకున్నట్లు పోలీసులు తెలిపారు. అక్కడి నుంచి మళ్లీ బొల్లారం రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. అయితే అప్పటికే ఆమె కోసం వెతుకుతున్న విక్కీ, అతడి స్నేహితుడు గణేశ్ అక్కడికి చేరుకుని బాలికను అడ్డుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.
బాలికను మత్తులోకి తీసుకెళ్లి మేడ్చల్ రైల్వే స్టేషన్‌కు తరలించినట్లు ఆరోపణలు ఉన్నాయి. అక్కడ రైలులో కూడా ఆమెపై లైంగిక దాడికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం వారు మల్కాజిగిరి ప్రాంతానికి చేరుకున్నట్లు విచారణలో వెల్లడైందని పేర్కొన్నారు.

## చాకచక్యంగా తప్పించుకుని..

మల్కాజిగిరి నుంచి ధూల్‌పేటకు ఆటోలో వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో బాలిక వారి నుంచి తప్పించుకున్నట్లు పోలీసులు తెలిపారు. అక్కడి నుంచి ఎలాగోలా ఇంటికి చేరుకుంది.
ఇంటికి వచ్చిన బాలిక తనకు ఎదురైన ఘటనలను కుటుంబ సభ్యులకు వివరించడంతో వారు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే అల్వాల్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు బాలిక నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

## పోక్సో చట్టం కింద కేసు

బాధితురాలు మైనర్ కావడంతో పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఆమెను వైద్య పరీక్షలకు తరలించి అవసరమైన సహాయాన్ని అందించినట్లు తెలుస్తోంది. బాలిక వెల్లడించిన వివరాలు, కుటుంబ సభ్యుల ఫిర్యాదు, ఇతర ఆధారాల ఆధారంగా దర్యాప్తు కొనసాగిస్తున్నారు.
ఘటనలో మొత్తం ఎనిమిది మంది వరకు పాల్గొన్నట్లు ఆరోపణలు ఉన్నప్పటికీ, ప్రతి వ్యక్తి పాత్రను విడివిడిగా నిర్ధారించాల్సి ఉందని పోలీసులు చెబుతున్నారు. బాధితురాలికి పరిచయమైన వ్యక్తులు ఆమెను ఎలా సంప్రదించారు? మత్తు పదార్థాలు ఎక్కడి నుంచి తీసుకువచ్చారు? ఆమెను పలుచోట్లకు ఎవరు తీసుకెళ్లారు? ఈ ఘటనల వెనుక మరెవరైనా ఉన్నారా? అనే కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

## మత్తు పదార్థాల కోణంలోనూ దర్యాప్తు

మైనర్ బాలికకు గంజాయి, మద్యం తదితర మత్తు పదార్థాలు అందించినట్లు ఆరోపణలు రావడంతో పోలీసులు ఆ కోణంపైనా దృష్టి సారించారు. మత్తు పదార్థాలను ఎవరు సమకూర్చారు? వాటిని బాలికకు అందించిన వ్యక్తులు ఎవరు? నిందితుల మధ్య సంబంధాలు ఏమిటి? అన్న అంశాలపై వివరాలు సేకరిస్తున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా మైనర్లను పరిచయం చేసుకుని వారిని లక్ష్యంగా చేసుకుంటున్నారా? అనే అంశాన్ని కూడా పోలీసులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. నిందితుల మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమ ఖాతాలు, కాల్ వివరాలు తదితరాలను పరిశీలించే అవకాశం ఉంది.

## తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి

మైనర్ పిల్లల ప్రవర్తనలో అకస్మాత్తుగా మార్పులు కనిపిస్తే తల్లిదండ్రులు నిర్లక్ష్యం చేయకూడదని పోలీసులు సూచిస్తున్నారు. పిల్లలు ఎవరితో స్నేహం చేస్తున్నారు? సామాజిక మాధ్యమాల్లో ఎవరితో మాట్లాడుతున్నారు? ఎక్కడికి వెళ్తున్నారు? వంటి విషయాలపై తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని చెబుతున్నారు.అల్వాల్‌లో వెలుగులోకి వచ్చిన ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు. మైనర్ బాలికపై జరిగినట్లు ఆరోపణలు ఉన్నందున కేసును సున్నితంగా దర్యాప్తు చేస్తున్నామని, బాధితురాలి వివరాలను బహిర్గతం చేయరాదని పోలీసులు స్పష్టం చేశారు.నిందితులపై వచ్చిన ఆరోపణలు దర్యాప్తులో నిర్ధారణ కావాల్సి ఉంది.

# మూలాపేటలో ముస్తాబైన మరో సరస్వతీ నిలయం

**రూ.13.40 కోట్ల దాతృత్వంతో డీఎస్ఆర్ ప్రభుత్వ**

**బాలికోన్నత పాఠశాలకు కొత్త రూపు**

**24 తరగతి గదులు..**

**6 రకాల ల్యాబ్‌లు.. అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడా వసతులు**

**నేడు నారా లోకేశ్ చేతుల మీదుగా ప్రారంభం**



నెల్లూరు(ప్రశ్న న్యూస్) ఒకప్పుడు శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాల.. నేడు రాజుల కోటను తలపించేలా రూపుదిద్దుకుంది. ఆధునిక తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, క్రీడా ప్రాంగణాలు.. ఇలా విద్యార్థుల సమగ్ర వికాసానికి అవసరమైన వసతులతో కొత్త రూపాన్ని సంతరించుకుంది. నెల్లూరు నగరంలోని మూలాపేటలోని డీఎస్ఆర్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల ఇప్పుడు 'దేవిరెడ్డి శారదా ప్రభుత్వ హైస్కూల్'గా ముస్తాబైంది.రూ.13.40 కోట్ల దాతృత్వంతో డీఎస్ఆర్ కన్స్ట్రక్షన్స్ అధినేత దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి ఈ పాఠశాలను ఆధునిక విద్యాలయంగా తీర్చిదిద్దారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజన్, రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆలోచనలు, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ సంకల్పానికి ఈ పాఠశాల రూపకల్పన మరో నిదర్శనంగా నిలుస్తోంది.

## 24 వేల చదరపు అడుగుల్లో.. 24 తరగతి గదులు

రెండంతస్తుల్లో సుమారు 24 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో పాఠశాల భవనాన్ని నిర్మించారు. మొత్తం 24 తరగతి గదులు ఏర్పాటు చేశారు. ఆధునిక బోధనకు అనుగుణంగా 15 ఎల్‌ఈడీ తెరలు, 300 బెంచీలు సమకూర్చారు. ప్లే క్లాస్ నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు అవసరమైన వసతులను ఒకే ప్రాంగణంలో అందుబాటులోకి తీసుకొచ్చారు.

## లోకేశ్ చేతుల మీదుగా ప్రారంభం

అంతర్జాతీయ ప్రమాణాలతో రూపుదిద్దుకున్న దేవిరెడ్డి శారదా ప్రభుత్వ హైస్కూల్‌ను నేడు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రారంభించనున్నారు. కార్యక్రమ ఏర్పాట్లను మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి, డీఎస్ఆర్ కన్స్ట్రక్షన్స్ అధినేత దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సీఎం కార్యక్రమాల సమన్వయకర్త మంతెన సత్యనారాయణరాజు, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ తదితరులు పర్యవేక్షిస్తున్నారు.ప్రభుత్వ పాఠశాల అంటే కేవలం నాలుగు గోడలు, తరగతి గదులు మాత్రమే కాకుండా.. పేద విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్య, సాంకేతిక పరిజ్ఞానం, క్రీడా అవకాశాలను అందించే వేదికగా ఉండాలనే లక్ష్యానికి మూలాపేటలోని ఈ పాఠశాల ప్రతిరూపంగా నిలవనుంది.

# నవులూరులో ఆక్రమణదారుల దూకుడు!

**70 ఏళ్లుగా వినియోగిస్తున్న సమాధుల దారి ఆక్రమణ**

**ప్రత్యామ్నాయ రహదారి పనుల వద్ద ఉద్రిక్తత..**

**టౌన్ ప్లానింగ్ ఉద్యోగిపై ముగ్గురి దాడి**



మంగళగిరి(ప్రశ్న న్యూస్) నవులూరులో ఆక్రమణల వ్యవహారం వివాదాస్పదంగా మారింది. మక్కేవారిపేట సమాధులకు వెళ్లేందుకు స్థానికులు సుమారు 70 ఏళ్లుగా వినియోగిస్తున్న పాత ప్రధాన మార్గాన్ని కొందరు ఆక్రమించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రత్యామ్నాయ రహదారి అభివృద్ధి పనుల్లో భాగంగా నిర్మించిన జీఎస్‌బీ రోడ్డుపైనా వివాదం నెలకొంది.మక్కేవారిపేట సమాధుల రోడ్డు నుంచి గోలివారి తోటకు వెళ్లే ప్రత్యామ్నాయ మార్గాన్ని ఎంటీఎంసీ నిధులతో అభివృద్ధి చేస్తున్నారు.
ఇందులో భాగంగా మూడు రోజుల క్రితం జీఎస్‌బీ రోడ్డు నిర్మించారు. అయితే తమకు భీ-పారం, పట్టాలు ఉన్నాయని పేర్కొంటూ కొందరు రహదారి ప్రాంతంలో నిర్మాణాలు చేపట్టి అడ్డంకులు కల్పించినట్లు స్థానికులు చెబుతున్నారు.ఆక్రమణలను తొలగించేందుకు ప్రభుత్వ అధికారుల ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ సిబ్బంది వెళ్లిన సమయంలో వివాదం తలెత్తినట్లు సమాచారం. ఈ క్రమంలో టౌన్ ప్లానింగ్ ఉద్యోగిపై ముగ్గురు వ్యక్తులు దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఘటనపై బాధిత ఉద్యోగి మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీనిపై పోలీసులు విచారణ చేపట్టాల్సి ఉంది.

## 70 ఏళ్ల దారికి పట్టాలు ఎలా వచ్చాయి?

మక్కేవారిపేట సమాధులకు వెళ్లే మార్గాన్ని స్థానికులు దశాబ్దాలుగా వినియోగిస్తున్న నేపథ్యంలో, ఆ మార్గంలోని భూములకు వ్యక్తిగత పట్టాలు ఎలా మంజూరయ్యాయన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. భూ రికార్డులు, పట్టాల మంజూరు ప్రక్రియ, మార్గం వాస్తవ స్వరూపంపై రెవెన్యూ అధికారులు సమగ్రంగా విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు.ప్రజలు, అధికారుల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ఆక్రమణలను తొలగించి పాత దారిని అందుబాటులోకి తీసుకురావాలని, ప్రభుత్వ స్థలాలు లేదా రహదారి భూములపై ఆక్రమణలు ఉంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. అధికారులపై దాడికి పాల్పడినట్లు వచ్చిన ఆరోపణలపైనా సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## చంద్రబాబు డైరెక్షన్‌లో రేవంత్‌రెడ్డి

# పసుపునీళ్ల రాజకీయం

**అభివృద్ధిని గాలికొదిలేసి కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై దాడులా.?**

**హామీలు ఎగ్గొట్టిన సీఎం రేవంత్ పైనే మొదట కేసు పెట్టాలి**

**- బీఆర్ఎస్ నేత దేవి రవీందర్ నిప్పులు**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు డైరెక్షన్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పసుపునీళ్ల దిగజారుడు రాజకీయం చేస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం మాజీ కన్వీనర్ దేవి రవీందర్ ధ్వజమెత్తారు. పాలన, ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ చిల్లర రాజకీయాలు నడుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆయన మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు.

### మంత్రుల తొలగింపు ఎపిసోడ్ నుంచి దృష్టి మళ్లించేందుకే కుట్ర:

హైదరాబాద్‌లో కూర్చున్న సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా మానిటర్ చేస్తూ.. ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య, కవ్వంపల్లి సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి తదితరులను ఉసిగొల్పి కేసీఆర్ ఫామ్‌హౌస్‌పైకి దాడికి పంపారని ఆరోపించారు. బీసీ మహిళా మంత్రి కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసిన వ్యవహారం ప్రభుత్వంపై ప్రభావం పడకుండా ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ ఫామ్‌హౌస్ దాడి డ్రామాకు తెరతీశారని మండిపడ్డారు. కేసీఆర్ నివాసంపై దాడికి తెగబడ్డ వారితో పాటు నర్సారెడ్డిపై వెంటనే కేసులు నమోదు చేసి కఠినంగా అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

### ఎన్నికల హామీలు ఏవీ? ముద్దాయి రేవంతే!

నిజంగా చిత్తశుద్ధి ఉంటే ముందుగా కేసు పెట్టాల్సింది రేవంత్ రెడ్డి ప్రభుత్వంపైనేనని రవీందర్ స్పష్టం చేశారు. చేవెళ్ల డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కినందుకు సీఎం రేవంత్ మొదటి ముద్దాయి అవుతారని అన్నారు. కేసీఆర్ హయాంలో దళితబంధు కింద రూ.10 లక్షలు అందిస్తే, అధికారంలోకి వస్తే రూ.12 లక్షలు ఇస్తామని చెప్పి నేడు రూపాయి కూడా విదల్చడం లేదని విమర్శించారు. బీసీ బంధు, విదేశీ విద్యానిధి, రాజీవ్ యువ వికాస్ రుణాలు, నెలకు రూ.2,000 నిరుద్యోగ భృతి వంటి అనేక వాగ్దానాలను తుంగలో తొక్కి యువతను, బడుగు బలహీన వర్గాలను నిలువునా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో గంగిశెట్టి రవీందర్, కళ్యాణ్ కార్ నర్సింగరావు, నవాజ్ మీరా, అత్తెల్లి శ్రీనివాస్, గోలి సంతోష్, శ్రీధర్, పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా

# జరగాలి, మద్యం, డీజేలకు నో

**- గజ్వేల్ శాంతి సమావేశంలో పోలీసుల స్పష్టమైన హెచ్చరిక**

**నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు**

**ఇన్స్పెక్టర్ రవికుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ చందన రవీందర్**



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )గణేష్ నవరాత్రులు, నిమజ్జన కార్యక్రమాలను శాంతియుతంగా, క్రమశిక్షణతో నిర్వహించి గజ్వేల్‌కు మంచి పేరు తీసుకురావాలని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్ కోరారు. మంగళవారం సాయంత్రం గజ్వేల్‌లోని కోల అభిరామ్ ఫంక్షన్ హాల్‌లో గజ్వేల్ టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన గణేష్ నవరాత్రుల శాంతి సమావేశానికి ఆమె హాజరై మండపాల నిర్వాహకులు, యువతకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రతి గణేష్ మండపం వద్ద నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా భక్తిశ్రద్ధలతో ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలతో సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేడుకలు నిర్వహించాలని కోరారు. నిమజ్జన కార్యక్రమాలకు ఎవరూ మద్యం సేవించి హాజరు కావద్దని, యువత బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కుటుంబ సభ్యులు, మహిళలు పెద్ద సంఖ్యలో నిమజ్జన కార్యక్రమాల్లో పాల్గొంటే యువతలో బాధ్యత మరింత పెరుగుతుందని అన్నారు. ఎవరూ అనవసరంగా కేసుల్లో చిక్కుకుని తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. మున్సిపాలిటీ పరిధిలో నిమజ్జనాల సందర్భంగా పారిశుద్ధ్యం, విద్యుత్, ట్రాఫిక్ తదితర అంశాల్లో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు.

### డీజేలకు అనుమతి లేదు: పోలీసులు

గజ్వేల్ టౌన్ ఇన్‌స్పెక్టర్ వి. రవికుమార్ ఆధ్వర్యంలో, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ డి. సత్యనారాయణ సమన్వయంతో జరిగిన ఈ సమావేశానికి సుమారు 400 మంది హాజరయ్యారు. గణేష్ నవరాత్రులు, నిమజ్జనాలను శాంతియుతంగా, క్రమశిక్షణతో నిర్వహించాలని పోలీసులు సూచించారు. డీజే సౌండ్ సిస్టమ్స్, అధిక శబ్దంతో కూడిన సౌండ్ సిస్టమ్స్‌కు అనుమతి లేదని, ప్రభుత్వం, పోలీసు శాఖ నిర్దేశించిన శబ్ద పరిమితులను తప్పనిసరిగా పాటించాలని నిర్వాహకులకు స్పష్టం చేశారు. నిమజ్జన సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసుల సూచనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, పోలీసు సిబ్బందికి నిర్వాహకులు పూర్తిగా సహకరించాలని కోరారు. గణేష్ మండపాల వద్ద భద్రతా చర్యలు, క్రమశిక్షణ, అప్రమత్తత పాటిస్తూ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఉత్సవాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ డి. సత్యనారాయణ, విద్యుత్ శాఖ ఏఈ మారుతి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కళ్యాణ్కర్ పద్మబాయి నర్సింగ్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, మున్సిపల్ సిబ్బంది, సానిటేషన్ ఇన్‌చార్జి సుధాకర్, శ్రీనివాస్ రెడ్డి, గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకులు, యువత తదితరులు పాల్గొన్నారు.

# రాజన్న ప్రసాదంగా కోడెల పంపిణీ

**ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**భక్తులు పాలు మరవని చిన్న కోడెలను సమర్పించవద్దు**



వేములవాడ(ప్రశ్న న్యూస్) రైతులకు రాజన్న ప్రసాదంగా కోడెలను పంపిణీ చేస్తున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి చెందిన తిప్పాపూర్ గోశాలలో కోడెలను సన్న, చిన్నకారు రైతులకు రాజన్న ప్రసాదంగా అందించే కార్యక్రమాన్ని మంగళవారం ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు కోడెలను అందజేశారు. ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. కోరిన కోరికలు తీర్చే తండ్రిగా భక్తుల విశ్వాసాన్ని పొందిన రాజన్నకు కోడె మొక్కు చెల్లించడం విశిష్టమైన సంప్రదాయమన్నారు. కోడెలను గతంలో స్వచ్ఛంద సంస్థలకు అందించే సమయంలో అనేక ఇబ్బందులు ఎదురయ్యాయని, ఈ నేపథ్యంలో నిరుపేదలు, సన్న, చిన్నకారు రైతులకు అందించాలనే ఆలోచనతో ప్రజా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు. ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలో భాగంగా ఈ కార్యక్రమాన్ని మరింత పద్ధతిగా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసి, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న నిరుపేదలు, సన్న, చిన్నకారు రైతులను ఎంపిక చేసి కోడెలను అందిస్తున్నట్లు వివరించారు.

### కోడెలను సంరక్షించాలి

రైతులు రాజన్న ప్రసాదంగా భావించి, తమ బిడ్డలను ఎలా చూసుకుంటారో అలాగే కోడెలను సంరక్షించాలని కోరారు. కోడెల సంరక్షణపై దేవాదాయ, పశుసంవర్ధక శాఖ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తారని చెప్పారు. కోడెలను అక్రమంగా తరలించడం లేదా ఇతర మార్గాల్లో వినియోగించడం వంటి చర్యలకు పాల్పడితే కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వేములవాడ మున్సిపల్ ఛైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రొండి రాజు, వైస్ ఛైర్మన్ రాకేశ్, ఆలయ ఈఓ రమాదేవి, ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి శ్రీధర్, తహసీల్దార్ జయంత్, పలువురు కౌన్సిలర్లు, ఏఓలు, పశు సంవర్ధక శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా క్రికెట్‌కు డబ్ల్యూపీఎల్ వేదిక

## గ్రామీణ ప్రతిభను వెలికితీసేందుకు చక్కని అవకాశం

**టీజర్ విడుదల చేసిన: మహిళా కమిషన్**

**చైర్‌పర్సన్ రాయపాటి శైలజ**



విజయవాడ(ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లోని మహిళా క్రికెట్ ప్రతిభను వెలికితీసి రాష్ట్ర, జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు ఆంధ్రప్రదేశ్ మహిళా ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) గొప్ప వేదికగా నిలుస్తుందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ అన్నారు. ఈ నెల 19 నుంచి ప్రారంభం కానున్న డబ్ల్యూపీఎల్ టీజర్‌ను మంగళవారం విజయవాడలోని ఏసీఏ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయంలో ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) డైరెక్టర్ ఆఫ్ క్రికెట్ ఆపరేషన్స్ కళ్యాణ్ కృష్ణ, సీఏఓ జై కిషన్.. డబ్ల్యూపీఎల్ నిర్వహణ, టోర్నమెంట్ ప్రత్యేకతలు, మహిళా క్రికెటర్లకు కల్పిస్తున్న అవకాశాలను చైర్‌పర్సన్‌కు వివరించారు.

### గ్రామీణ ప్రతిభకు గుర్తింపు

గ్రామీణ స్థాయి నుంచి మహిళా క్రికెట్ ప్రతిభను గుర్తించి రాష్ట్ర స్థాయిలో తమ సత్తా చాటేందుకు డబ్ల్యూపీఎల్ చక్కటి అవకాశం కల్పిస్తుందని శైలజ పేర్కొన్నారు. మహిళా క్రికెటర్లు ఇప్పటికే దేశం గర్వించేలా అద్భుత ప్రదర్శనలు చేస్తున్నారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారిణులను స్ఫూర్తిగా తీసుకుని మరింత మంది యువతులు క్రికెట్‌లోకి రావాలని ఆకాంక్షించారు. తెలుగు తేజం శ్రీ చరణి తన ప్రతిభతో ఆకట్టుకుంటున్నారని, ఆమె తరహాలో ప్రతిభావంతులైన క్రీడాకారిణులు మరింత మంది వెలుగులోకి రావడానికి డబ్ల్యూపీఎల్ దోహదపడుతుందని అన్నారు.

### అవకాశాలు.. ప్రోత్సాహం అవసరం


మహిళా క్రీడాకారిణులకు సరైన అవకాశాలు, ప్రోత్సాహం లభిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరింత ఉన్నతంగా రాణించే అవకాశం ఉందని శైలజ తెలిపారు. క్రీడల్లో మహిళల భాగస్వామ్యాన్ని పెంచేందుకు ప్రతిష్టాత్మక టోర్నమెంట్లు కీలకంగా మారతాయని పేర్కొన్నారు.
అమరావతి ప్రాంతమైన మంగళగిరిలో డబ్ల్యూపీఎల్ నిర్వహిస్తున్న ఏసీఏను ఆమె అభినందించారు. ఈ లీగ్ ద్వారా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న మహిళా క్రికెట్ ప్రతిభకు మరింత గుర్తింపు లభించాలని, భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్ నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారిణులు పెద్ద సంఖ్యలో వెలుగులోకి రావాలని ఆకాంక్షించారు. టోర్నమెంట్ విజయవంతం కావాలని శుభాకాంక్షలు తెలిపారు.

# ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవ శుభారంభం

**మీన లగ్నంలో గరుడధ్వజం ఆవిష్కరణ..**

**శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభం**

**వేదగానాలు.. మంగళవాద్యాల నడుమ ఆహ్వాన ఘట్టం**



తిరుమల(ప్రశ్న న్యూస్) శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు మంగళవారం తిరుమలలో వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం 6.21 నుంచి 6.35 గంటల మధ్య మీన లగ్నంలో ధ్వజారోహణ ఘట్టం నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారి సమక్షంలో వేదగానాలు, మంగళవాద్యాల నడుమ అర్చకస్వాములు బంగారు ధ్వజస్తంభంపై గరుడధ్వజాన్ని ఎగురవేశారు.
బ్రహ్మోత్సవాలకు సకల దేవతలు, అష్టదిక్పాలకులను ఆహ్వానించే పవిత్ర ఘట్టంగా ధ్వజారోహణకు విశిష్ట ప్రాశస్త్యం ఉంది. దీంతో తొమ్మిది రోజుల పాటు జరిగే శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు అధికారికంగా శ్రీకారం చుట్టినట్లయింది.

### మాడ వీధుల్లో మలయప్పస్వామి ఊరేగింపు,

ధ్వజారోహణకు ముందు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారిని బంగారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు. పరివార దేవతలైన శ్రీ అనంత, గరుడ, చక్రత్తాళ్వార్, సేనాధిపతివారితో పాటు ధ్వజపటాన్ని కూడా ఊరేగింపులో తీసుకెళ్లారు. వేదమంత్రోచ్చారణలు, మంగళవాద్యాల మధ్య జరిగిన ఈ కార్యక్రమాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో వీక్షించారు. ధ్వజారోహణ అనంతరం శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో జరిగే వాహన సేవలకు తిరుమల సిద్ధమైంది. అధికారుల హాజరుకార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, కంకణ బట్టర్ వెంకట రాఘవ దీక్షితులు, టీటీడీ పాలకమండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ, భాను ప్రకాష్‌రెడ్డి, పనబాక లక్ష్మి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

# పట్టాలు త్వరలో.. ఇంటింటికీ నీరు

**ఇల్లు ఉండి పట్టాలు లేని అర్హులకు త్వరలోనే పట్టాలు**

**విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు: హోం మంత్రి అనిత**



నక్కపల్లి(ప్రశ్న న్యూస్) పాయకరావుపేట నియోజకవర్గంలో ఇళ్లు ఉండి పట్టాలు లేని అర్హులైన కుటుంబాలకు త్వరలో ఇళ్ల పట్టాలు అందించేందుకు చర్యలు చేపడతామని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. జలజీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ అభివృద్ధిపై నాలుగు మండలాల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఇరిగేషన్, పంచాయతీరాజ్, విద్యుత్, ఆర్అండ్‌బీ, ఎండోమెంట్, పీఆర్ ఇంజినీరింగ్ తదితర శాఖల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని మంత్రి అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తిచేసి ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించారు. అధికారులు ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని, విధుల్లో అలసత్వాన్ని ఎంతమాత్రం ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

### గ్రామాల్లో సీసీ కెమెరాలు

గ్రామాల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలని పోలీసులను ఆదేశించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. పాయకరావుపేట నియోజకవర్గంలోని గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఇంజినీర్స్ డే సందర్భంగా ఇంజినీర్లకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి.. దేశ నిర్మాణంలో ఇంజినీర్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు.

# కష్టాల గెడ్డపై.. అభివృద్ధి వంతెన

**రూ.5.65 కోట్లతో ఒంకులూరు రాకాసిగెడ్డపై భారీ వంతెన**

**నాడు కాలినడక వంతెన..**

**నేడు వాహనాల రాకపోకలకు వారధి శివాజీ అడుగులు..**

**శిరీషతో అభివృద్ధికి కొనసాగింపు**



వజ్రపుకొత్తూరు(ప్రశ్న న్యూస్) ఉద్దాన ప్రాంత ప్రజల చిరకాల రవాణా కష్టాలకు శాశ్వత పరిష్కారం లభించింది. శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలం ఒంకులూరు వద్ద రాకాసిగెడ్డపై రూ.5.65 కోట్ల ప్రభుత్వ నిధులతో నిర్మించిన భారీ వంతెన ప్రారంభానికి సిద్ధమైంది. దీంతో మెట్టూరు-- ఒంకులూరు మీదుగా అనకాపల్లి, బాహడపల్లి, బిడిమి, భేతాళపురం తదితర గ్రామాలకు రాకపోకలు సులభతరం కానున్నాయి. రాకాసిగెడ్డ వర్షాకాలంలో ఉధృతంగా ప్రవహించడంతో గతంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. విద్యార్థులు, రైతులు, కూలీలు, అత్యవసర పరిస్థితుల్లో రోగులు గెడ్డ దాటేందుకు అవస్థలు ఎదుర్కొనేవారు. ఈ సమస్యను గుర్తించిన అప్పటి ఎమ్మెల్యే గౌతు శ్యామసుందర శివాజీ రూ.50 లక్షల ప్రభుత్వ నిధులతో కాలినడక వంతెన నిర్మాణానికి కృషి చేశారు. అప్పట్లో అది ప్రజలకు ఎంతో ఊరట కలిగించింది.

### నేడు.. భారీ వంతెన

కాలానుగుణంగా పెరిగిన జనాభా, రవాణా అవసరాలకు కాలినడక వంతెన సరిపోకపోవడంతో వాహన రాకపోకలకు శాశ్వత వంతెన అవసరమైంది. ఈ నేపథ్యంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రత్యేక చొరవతో రూ.5.65 కోట్లతో భారీ వంతెన నిర్మాణం పూర్తయింది. ప్రారంభానికి సిద్ధమైన ఈ వంతెనతో ఉద్దాన ప్రాంతంలోని పలు గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపడనుంది. గతంలో వర్షం కురిస్తే రాకాసిగెడ్డ పొంగిపొర్లడంతో రాకపోకలు నిలిచిపోయేవి. అత్యవసర వైద్యం, విద్యార్థుల ప్రయాణం, వ్యవసాయ ఉత్పత్తుల తరలింపు వంటి అంశాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడేవారు. కొత్త వంతెన అందుబాటులోకి వస్తే ఈ సమస్యలకు శాశ్వతంగా చెక్ పడనుంది.

# ‘మకుటం’అమెజాన్ మూవీ రివ్యూ!



తమిళ .. తెలుగు భాషల్లో మాస్ యాక్షన్ హీరోగా విశాల్ కి మంచి క్రేజ్ ఉంది. తమిళంతో పాటు తెలుగులోను ఆయన సినిమాలు తప్పకుండా రిలీజ్ అవుతూ ఉంటాయి. అలా ఆయన నుంచి రీసెంటుగా వచ్చిన సినిమానే ‘మకుటం’. సూపర్ గుడ్ ఫిలిమ్స్ వారు నిర్మించిన ఈ సినిమాకి విశాల్ దర్శకత్వం వహించడం విశేషం. ఆగస్టు 14వ తేదీన విడుదలైన ఈ సినిమా, ‘అమెజాన్ ప్రైమ్’లో ప్రత్యక్షమైంది. తమిళంతో పాటు తెలుగు .. మలయాళ .. కన్నడ భాషల్లో ఈ నెల 11వ తేదీ నుంచి అందుబాటులో ఉంది. ‘కృపాకరం’ (విశాల్) ఒక చిన్నపాటి జాబ్ చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తుంటాడు. భార్య ‘జమున’ (దుషారా విజయన్) ఇద్దరు పిల్లలు .. ఇదే అతని కుటుంబం. ఎవరితో ఎలాటి గొడవలు లేకుండా చాలా ప్రశాంతమైన జీవితాన్ని కొనసాగిస్తూ ఉంటాడు. ఇంట్లో వాళ్లు ఒత్తిడి చేస్తుండటంతో, సెకండ్స్ లో ఒక కారు తీసుకుంటాడు. భార్య బిడ్డలను తీసుకుని సరదాగా ఒక ట్రిప్ కి వెళతాడు. ఆ సమయంలోనే వాళ్లు మాఫియా ముఠాకి చెందిన ‘నాగ’ (అజయ్) అనుచరుల కంటపడతారు. ‘నాగ’కి మాఫియా నాయకుడైన ‘లింగా’తో గొడవలు ఉంటాయి. నాగతో పాటు ‘మార్టిన్’ .. ‘లాలా’ ఇద్దరూ కూడా ‘లింగా’పై పగతీర్చుకునే సమయం కోసం వెయిట్ చేస్తుంటారు. అలాంటి సమయంలోనే, ‘లింగా’ కొడుకు కృపాకరం ఫ్యామిలీని నాగ అనుచరులు చూస్తారు. అతనిని ‘లింగా’ అనుకుని ఒక్కసారిగా దాడి చేస్తారు. కృపాకరం ఆ షాక్ నుంచి తేరుకునేలోగా అతని భార్యను .. కూతురును ఆ గ్యాంగ్ చంపేస్తుంది. జరిగిన సంఘటనకి కారకుడు తన తండ్రి అని తెలిసి కృపాకరం కోపంతో రగిలిపోతాడు. కృపాకరం తన తండ్రికి దూరంగా ఎందుకు ఉండవలసి వస్తుంది? తండ్రి కారణంగా తాను ఫ్యామిలీని కోల్పోవడం పట్ల కృపాకరం ఎలా స్పదిస్తాడు? తన కారణంగా తన కొడుకు బాధపడటంతో లింగా ఏం చేస్తాడు? ఆయనను మాఫియా వైపు నడిపించిన పరిస్థితులు ఎలాంటివి? అసలు లింగాతో నాగ – మార్టిన్ – లాలాకి ఉన్న గొడవేంటి? తన భార్యాబిడ్డల మరణానికి కారకులైన గ్యాంగ్ పై కృపాకరం ఎలా రివేంజ్ తీర్చుకుంటాడు? అనేది కథ. మాస్ యాక్షన్ హీరోగా విశాల్ కి మంచి క్రేజ్ ఉంది. ఈ తరహా సినిమాలు ఇంతకుముందు ఆయన చాలా చేశాడు. అలాంటి విశాల్ అదే జోనర్లోని ఒక సినిమాకి దర్శకత్వం వహించాడు అనగానే అభిమానులు గట్టిగానే ఆశలు పెట్టుకున్నారు. విడుదలకి ముందే అంచనాలు పెట్టుకున్నారు. ఈ సినిమాలో తండ్రీ కొడుకులుగా ఆయన ద్విపాత్రాభినయం చేయడం మరో విశేషంగా చెప్పుకున్నారు. అలాంటి ఈ సినిమా, థియేటర్ల వైపు నుంచి హిట్ టాక్ ను తెచ్చుకోలేకపోయింది. కృపాకరం భార్య పిల్లలు .. చాలీచాలని జీతం .. కారు కొనాలనే ఆశ .. కొనడంలో ఎదురయ్యే అవమానాలు .. కొన్న తరువాత ఎదురయ్యే ఇబ్బందులతో ఫస్టాఫ్ నడుస్తుంది. ఇంటర్వెల్ బ్యాంగ్ వరకూ కొడుకు పాత్రతో నడవగా, ఆ తరువాత తండ్రి పాత్రగా ‘లింగా’ తెరపైకి వస్తుంది. అప్పటి నుంచి ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్ గా లింగా కథ ఎక్కువగా కొనసాగుతుంది. కారు కొనడానికి పడేపాట్లతో ఫస్టాఫ్ ను సాగదీస్తూ వెళ్లిన విశాల్, సెకండాఫ్ లో అంజలిని లవ్ లోకి దింపడానికి చేసే ప్రయత్నాలతో ఎక్కువ సమయాన్ని వృథా చేశాడు. సెకండాఫ్ లో ‘లింగా’ పాత్ర చుట్టూనే కథ తిరుగుతుంది. అయితే ఆయన పాత్రలోని పవర్ ను చూపించకుండా, మాఫియా డాన్ కావడానికి ముందు .. అంజలిని ముగ్గులోకి దింపే సన్నివేశాలతోనే కాలక్షేపం చేయడం ప్రేక్షకులను నిరాశకు గురిచేస్తుంది. మాఫియా డాన్ గా ఎదిగిన తరువాత ‘లింగా’ పాత్ర గురించి పక్కనున్నవాళ్లు గొప్పలు చెప్పడమే తప్ప, అతగాడు చేసేది ఏమీ ఉండదు. తన గురించి చెబుతూ ఉంటే ఎంజాయ్ చేస్తూ స్టైల్ గా ఒక లుక్ విసరడం తప్ప. ఈ సినిమా ఫస్టాఫ్ విషయానికొస్తే, కృపాకర్ తానెవరన్నది బయట ప్రపంచానికి తెలియకుండా సింపుల్ లైఫ్ స్టైల్ ను కొనసాగిస్తూ ఉంటాడు. సెకండాఫ్ దగ్గరికి వచ్చేసరికి లింగా పాత్ర ప్రధానంగా, సముద్రం .. జాలరులు .. పోర్టుపై పెత్తనం .. అప్పటికే డాన్ గా ఉన్నవాళ్లు లింగాను ఆదరించడం .. షిప్పుల్లో అక్రమ రవాణా .. పోర్టు నుంచి సరుకును విడిపించడం వంటి సన్నివేశాలతో సాగుతుంది. కొన్ని వందల సినిమాలలో ఆడియన్స్ చూసి చూసి విసుగెత్తిపోయిన సన్నివేశాలు ఇవి. ఏ మాత్రం అటు ఇటు కాకుండా అదే ట్రాక్ లో నడుస్తాయి. ఈ కథ 1965లో మొదలై 2025 వరకూ నడుస్తుంది. ‘లింగా’ పాత్ర 1980లలో నడుస్తుంది. ఆ కాలం నాటి కాస్ట్యూమ్స్ తో విశాల్ బాగానే ఇబ్బంది పెడతాడు. నిజానికి ఆయన ఆ పాత్రలో సరిగ్గా సెట్ కాలేదు కూడా. ఇక 2025 కాలానికి చెందిన పాత్రలో విశాల్ యాక్టింగ్ మామూలే.

దుషారా విజయన్ మంచి ఆర్టిస్ట్. కానీ యాక్టింగ్ చేసే అవకాశం ఆమెకి దక్కలేదు. ఉన్నంతసేపు అంజలి బాగానే సందడి చేసింది. రిచర్డ్ ఫొటోగ్రఫీ ఫరవాలేదు. జీవీ ప్రకాశ్ కుమార్ నేపథ్య సంగీతం కాస్త గందరగోళంగానే సాగింది. శ్రీకాంత్ ఎడిటింగ్ వైపు నుంచి చూసుకుంటే, 3 గంటల నిడివిలో ట్రిమ్ చేయవలసిన సీన్స్ కొన్ని కనిపిస్తాయి. మాస్ యాక్షన్ హీరోగా విశాల్ కి మంచి అనుభవం ఉంది. అయితే దర్శకుడిగా ఆయన రొటీన్ కథను రొటీన్ గా చెబుతూ వచ్చాడు. అందువల్లనే గతంలో వచ్చిన సినిమాలలో ఇప్పటి విశాల్ ను చూస్తున్నట్టుగా అనిపిస్తుంది. ‘మకుటం’ సంగతి అలా ఉంచితే, సాగతీత సన్నివేశాలతో కూడిన ఈ సినిమా, ప్రేక్షకుల సహనానికి పెద్ద పరీక్ష పెడుతుంది.

## నన్ను చూసే కోణంలోనే లోపం..
## నా దుస్తుల్లో కాదు: ఐశ్వర్య లక్ష్మి



ప్రముఖ నటి ఐశ్వర్య లక్ష్మి గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జరుగుతున్న విపరీతమైన ట్రోలింగ్‌పై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇటీవల తిరువనంతపురంలో జరిగిన ఒక జువెలరీ షాప్ ప్రారంభోత్సవానికి హాజరైన సమయంలో ఆమె ధరించిన దుస్తులపై కొందరు నెటిజన్లు అసభ్యకర రీతిలో కామెంట్లు చేశారు. ఈ వివాదంపై తాజాగా ఒక ఇంటర్వ్యూలో స్పందించిన ఐశ్వర్య లక్ష్మి, ఆ రోజు ఈవెంట్‌లో జరిగిన అసలు నిజాలను వెల్లడించి ట్రోలర్లకు గట్టి కౌంటర్ ఇచ్చారు. ఆ ఈవెంట్‌లో కొందరు ఫొటోగ్రాఫర్లు తన ముఖాన్ని సరిగా కవర్ చేయకుండా, కావాలనే అనుచిత కోణాల్లో ఫొటోలు తీసేందుకు ప్రయత్నించారని ఆమె బహిరంగంగా ఆరోపించారు. ఆ అసౌకర్య వాతావరణం వల్ల తన బాడీ లాంగ్వేజ్ మారిందని, అంతేకానీ తన దుస్తుల్లో ఎలాంటి లోపం లేదని స్పష్టం చేశారు. ఇబ్బందికరంగా ఉంటే అలాంటి బట్టలు ఎందుకు వేసుకోవడం? అని ప్రశ్నించే వారి మానసికత్వాన్ని ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. సంస్కృతి అనేది కేవలం మహిళలు వేసుకునే దుస్తుల్లోనే ఉందా, ప్రవర్తనలో ఉండదా..? అని ప్రశ్నించారు. దేశ ఆర్థిక వృద్ధి, వృద్ధుల సంక్షేమం లాంటి సామాజికాంశాలపై చర్చించని సమాజం, మహిళల దుస్తుల గురించి మాట్లాడేందుకు మాత్రం సిద్ధంగా ఉంటుందని ధ్వజమెత్తారు. ఇకనైనా ప్రతీ ఒక్కరూ మహిళల వ్యక్తిగత స్వేచ్ఛను గౌరవించడం నేర్చుకోవాలని ఐశ్వర్య హితవు పలికారు.

## ‘డీజే టిల్లు’ దర్శకుడి కొత్త సినిమా..
### ఆసక్తి రేపుతున్న ‘అనుమాన పక్షి’ ట్రైలర్



‘డీజే టిల్లు’ చిత్రంతో బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని అందుకున్న దర్శకుడు విమల్ కృష్ణ మరో వినూత్న కథతో ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యారు. ఆయన దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం ‘అనుమాన పక్షి’. టాలెంటెడ్ నటుడు రాగ్ మయూర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమా ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ఆసక్తికరమైన కథాంశంతో రూపొందిన ఈ ట్రైలర్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. ట్రైలర్‌ను బట్టి చూస్తే.. ఈ కథ మొత్తం హీరో పాత్రకున్న ‘అనుమానం’ అనే బలహీనత చుట్టూ తిరుగుతుందని అర్థమవుతోంది. ప్రతి చిన్న విషయాన్ని అనుమానించే వ్యక్తిగా రాగ్ మయూర్ నటన, హావభావాలు నవ్వులు పూయిస్తున్నాయి. కేవలం కామెడీ మాత్రమే కాకుండా, క్రైమ్ థ్రిల్లర్, డార్క్ కామెడీ అంశాలను కూడా దర్శకుడు జోడించినట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో రాగ్ మయూర్ సరసన మెరిన్ ఫిలిప్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ప్రిన్స్ సెసిల్, బ్రహ్మాజీ, అజయ్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. చిలకా ప్రొడక్షన్స్ సమర్పణలో రాజీవ్ నిర్మిస్తున్న ఈ సినిమాకు శ్రీచరణ్ పాకాల సంగీతం అందిస్తున్నారు. వైవిధ్యమైన కథతో వస్తున్న ఈ ‘అనుమాన పక్షి’ సెప్టెంబర్ 18న థియేటర్లలో విడుదల కానుంది. ‘డీజే టిల్లు’ లాంటి బ్లాక్‌బస్టర్ తర్వాత విమల్ కృష్ణ ఎలాంటి వినోదాన్ని అందిస్తారోనని సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# కెరీర్‌లోనే అత్యంత కీలక పాత్రలో రష్మిక
## – ఎం.ఎస్. సుబ్బులక్ష్మి బయోపిక్ ఖరారు



స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న తన కెరీర్‌లోనే ఒక ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టును దక్కించుకున్నారు. దిగ్గజ కర్ణాటక సంగీత విద్వాంసురాలు, భారతరత్న ఎం.ఎస్. సుబ్బులక్ష్మి జీవిత కథ ఆధారంగా తెరకెక్కుతున్న బయోపిక్‌లో ఆమె ప్రధాన పాత్ర పోషించనున్నట్లు అధికారికంగా ఖరారైంది. ‘ఎం.ఎస్. – ఎ లెగసీ ఆన్ స్క్రీన్’ అనే టైటిల్‌తో ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

నటిగా రష్మిక కెరీర్‌లో ఇది ఒక మైలురాయిగా నిలిచిపోతుందని భావిస్తున్నారు.ఈ చిత్రం ప్రారంభోత్సవాన్ని రేపు (సెప్టెంబర్ 16న) ఎం.ఎస్. సుబ్బులక్ష్మి 110వ జయంతిని పురస్కరించుకుని చెన్నైలో ఘనంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ నటుడు కమల్ హాసన్ ముఖ్య అతిథిగా హాజరవుతారని చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా ఇండియన్ కోరల్ ఎన్‌సెంబుల్ బృందం, సుబ్బులక్ష్మి ఆలపించిన కొన్ని అజరామర గీతాలతో సంగీత నివాళి అర్పించనుంది.‘జెర్సీ’ చిత్రంతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన గౌతమ్ తిన్ననూరి ఈ బయోపిక్‌కు దర్శకత్వం వహిస్తుండగా, స్టార్ కంపోజర్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు.

టాలీవుడ్ అగ్ర నిర్మాతలు అల్లు అరవింద్, బన్నీ వాస్‌లతో కలిసి ప్రముఖ నిర్మాత రాక్‌లైన్ వెంకటేశ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ పాత్ర కోసం చిత్రబృందం మొదట సాయి పల్లవి, రుక్మిణి వసంత్ వంటి నటీమణులను పరిశీలించింది. అయితే, ఇతర ప్రాజెక్టుల కారణంగా సాయి పల్లవి ఈ అవకాశం వదులుకున్నట్లు సమాచారం. అనంతరం నిర్వహించిన స్క్రీన్ టెస్టులో రష్మికను ఈ పాత్రకు ఎంపిక చేశారు. భారతరత్న పురస్కార గ్రహీత అయిన ఎం.ఎస్. సుబ్బులక్ష్మి, కేవలం శాస్త్రీయ సంగీతానికే పరిమితం కాలేదు. ఆమె ‘సేవాసదనం’, ‘శకుంతలై’, ‘సావిత్రి’, ‘మీరా’ వంటి చిత్రాల్లో నటించి నటిగా కూడా తనదైన ముద్ర వేశారు. అలాంటి గొప్ప వ్యక్తి పాత్రను పోషించడం రష్మికకు నటిగా అతిపెద్ద సవాల్ అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ఇక, రష్మిక నటిస్తున్న ఇతర సినిమాల విషయానికొస్తే.. యాక్షన్ థ్రిల్లర్ ‘మైసా’ నవంబర్ 27న విడుదల కానుండగా, విజయ్ దేవరకొండ సరసన నటిస్తున్న పాన్-ఇండియా యాక్షన్ డ్రామా ‘రణబాలి’ అక్టోబర్ 16న ప్రేక్షకుల ముందుకు రానుంది.

# ఇప్పట్లో ఆగేది లేదన్న బిగ్ బీ.. రిటైర్మెంట్‌పై అమితాబ్

## – ప్రస్తుతం కేబీసీ 18వ సీజన్‌తో బిజీగా ఉన్న అమితాబ్



బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ తన రిటైర్మెంట్‌పై వస్తున్న ఊహాగానాలకు తెరదించారు. తాను ఇప్పట్లో నటన నుంచి రిటైర్ కావడం లేదని సోమవారం రాత్రి స్పష్టం చేశారు. తన బ్లాగ్ పోస్టుల కారణంగా మొదలైన ఈ ప్రచారానికి ఆయన తనదైన శైలిలో ఫుల్‌స్టాప్ పెట్టారు.

సోమవారం రాత్రి తన వ్యక్తిగత బ్లాగ్‌లో ఈ విషయంపై అమితాబ్ స్పందించారు. “లేదు సర్, నేను పని నుంచి రిటైర్ అవ్వడం లేదు. నిద్రపోవడానికి వెళ్తున్నాను అని అర్థం! అక్కడికి రావడానికి మీకు అనుమతి లేదు” అంటూ హిందీలో రాసిన పోస్ట్‌లో చమత్కరించారు. దీంతో తన రిటైర్మెంట్ వార్తల్లో నిజం లేదని తేల్చి చెప్పారు. కొన్ని రోజుల క్రితం అమితాబ్ తన బ్లాగ్‌లో ఒక పోస్ట్ రాస్తూ చివర్లో “అండ్ ఐ రిటైర్” (నేను రిటైర్ అవుతున్నాను) అని ముగించారు. ఆ పదాన్ని చాలామంది తప్పుగా అర్థం చేసుకున్నారు. అమితాబ్ నటనకు గుడ్ బై చెప్పబోతున్నారంటూ వార్తలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలోనే ఆయన తాజాగా ఈ వివరణ ఇచ్చారు. ‘రిటైర్’ అంటే పడుకోవడానికి వెళ్లడమేనని, వృత్తిపరమైన బాధ్యతల నుంచి తప్పుకోవడం కాదని స్పష్టం చేశారు. 83 ఏళ్ల వయసులోనూ బిగ్ బీ ఏమాత్రం తీరిక లేకుండా పనిచేస్తున్నారు. ప్రస్తుతం ఆయన రెండు దశాబ్దాలుగా నిర్వహిస్తున్న ‘కౌన్ బనేగా కరోడ్‌పతి’ (కేబీసీ) 18వ సీజన్‌కు హోస్ట్‌గా వ్యవహరిస్తున్నారు. కేబీసీ ప్రసార తేదీలు ముందే ప్రకటించడంతో, ఒక రోజు ఉదయం 7 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 7 గంటల వరకు నిర్విరామంగా పనిచేసినట్లు ఇటీవల తన బ్లాగ్‌లోనే వెల్లడించారు.

## డేవిడ్ రెడ్డి’లో రమ్యకృష్ణ పాత్ర ఇదే..
# ఫస్ట్‌లుక్‌తో అంచనాలు పెంచిన మేకర్స్



మంచు మనోజ్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియడ్ యాక్షన్ డ్రామా ‘డేవిడ్ రెడ్డి’లో రమ్యకృష్ణ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆమె పోషిస్తున్న ‘కమలా రెడ్డి’ పాత్రను పరిచయం చేస్తూ చిత్రబృందం మంగళవారం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. రమ్యకృష్ణ పుట్టినరోజు సందర్భంగా ఈ పోస్టర్‌ను రిలీజ్ చేయడం విశేషం. పోస్టర్‌లో రమ్యకృష్ణ చాలా గంభీరంగా, పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్నారు. ఆమె పాత్ర సినిమాలో కీలకంగా ఉండబోతున్నట్లు లుక్ చూస్తే అర్థమవుతోంది. ఈ పోస్టర్‌ను మంచు మనోజ్ తన సోషల్ మీడియా ఖాతాలో షేర్ చేశారు. రమ్యకృష్ణతో కలిసి నటించడం గౌరవంగా ఉందని పేర్కొన్నారు. ఆమె స్క్రీన్ ప్రెజెన్స్, పాత్రపై పట్టు అద్భుతమని ప్రశంసించారు. ఇప్పటికే ఈ సినిమాలో ఉక్రెయిన్ మోడల్, నటి మరియా రియాబోషప్కా ‘క్లారా విట్‌మోర్’గా నటిస్తున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. ఆమె పాత్ర ప్రేమతో పాటు ప్రతీకారం, పోరాటంతో ముడిపడి ఉంటుందని చిత్రబృందం గతంలో తెలిపింది. ‘డేవిడ్ రెడ్డి’కి హనుమా రెడ్డి యక్కంటి దర్శకత్వం వహిస్తున్నారు. వెల్వెట్ సోల్ మోషన్ పిక్చర్స్ నిర్మిస్తోంది. 1897 నుంచి 1922 మధ్య కాలంలో కథ సాగనుంది. చరిత్ర నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ డ్రామాలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు అంశాలు ఉండనున్నాయి. మంచు మనోజ్ సినీ ప్రయాణం 21 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గత ఏడాది ఆగస్టులో ఈ సినిమాను ప్రకటించారు. తన కెరీర్‌లో ఇది 21వ చిత్రమని అప్పట్లో వెల్లడించారు.

# ప్రజా ప్రభుత్వంలో కూడా మారని
# పారిశుధ్య కార్మికుల బ్రతుకులు

**- నెలంతా గుడ్డు చాకిరి చేస్తే 9,500/-రూపాయలు**
**- పారిశుధ్య కార్మికుల ప్రాణాలతో చెలగాటం**

**(దుర్గం విజయ్ బాబు--ప్రశ్న న్యూస్ బ్యూరో)**




పొద్దున లేచిన నుండి రాత్రి పడుకునే దాకా ఎన్నో ఘటనలు చూస్తూ ఉంటాం. పొట్టకూటి కోసం పరుగులు పెట్టేవారు కొందరైతే, తిన్నది అరగడం కోసం తంటాలు పడేవారు మరికొందరు. కార్లల్ల ఖద్దరు బట్టలేసుకుని తిరిగే వాళ్ళు కొందరైతే, చిరిగిన బట్టలతో కాలం వెళ్లే తీసేవారు ఎందరో. మోర్లల తిరిగి చెత్తాచెదారం తీస్తున్న వాళ్లు మన కళ్ళముందే కనపడుతున్న పెద్దగా పట్టించుకున్న దాఖలాలు ఉండవు. అవి సహజమే అనుకునే ధోరణి చాలామందిలో ఉంటుంది. ఎక్కడో ఒక సంఘటన మన మనస్సులను కలుక్కుమని తట్టినట్టు రోజువారి దీనాభరిత జీవుల బతుకులు మన మనసులను అంతగా తాకవు. నిత్యం మన ఇండ్ల ముందు, మన వీధుల్లో, మన రోడ్ల మీద కనపడుతున్న వాళ్ళ బతుకులు ఎట్లా ఉంటాయో అనే కనీస ఆలోచన కూడా రాదు. ఎందుకంటే అది సహజమే అనే భావన మన మనసులో ఉండటమే కారణం. ఈ దేశంలో కుల నిర్మాణ అంతస్తుల వివక్ష పనిలో కూడా ఉంటది అనడానికి ఉత్తమ ఉదాహరణ మున్సిపాలిటీ, పంచాయతీ కార్మికుల్లో నూటికి తొంభై ఐదు శాతంగా పారిశుధ్య కార్మికులు దళిత కులాలకు చెందిన వారే ఉండటం. గ్రామపంచాయితీల్లో, మున్సిపాలిటీల్లో వివిధ స్థాయిల్లో కార్మికులు ఉంటారు. కానీ పారిశుధ్య కార్మికులుగా మాత్రం కింది కులాలకు చెందిన దళితులే అధికం. ఈ వివక్ష ఇంకా కిందకి దిగి స్త్రీ పురుష వివక్ష దాకా పోతుంది.(మన ఇండ్లల్లో పాయకానలు శుభ్రం చేసేది మెజారిటీగా మహిళలే ) అందుకు కారణం కొన్ని పనులు నీచమైనవని, ఆ నీచమైన పనులు సమాజ నిర్మాణపు అంతస్తుల్లో అట్టడుగున ఉన్నవారే చెయ్యాలనే నీచమైన ఆలోచనలవల్లే. దీనికి సాక్ష్యం కావాలంటే ఒకసారి ప్రభుత్వ శాశ్వత నియామకం కింద పారిశుధ్య కార్మికుల నియామక ప్రకటన ఇచ్చి చూడమనండి. ఖచ్చితంగా వాళ్ళ హాజరును నిరంతరం పర్యవేక్షించే వ్యవస్థ ఉంటది అంటే ఎంత మంది ఆధిపత్య కులాలు లేదా సామాజికంగా ఎదిగిన కులాల వ్యక్తులు అప్లై చేస్తారో తెలుస్తుంది. అప్పుడు నీచంగా చూడబడే పనులు సామాజికంగా కొన్ని కులాలకే చెందిన పనులుగా సమాజం, పాలకులు భావిస్తున్నారో లేదో తేటతెల్లం అవుతుంది. మన రాష్ట్రంలో గ్రేటర్ మున్సిపాలిటీ, మున్సిపాలిటీలు, జలమండలి, కార్పొరేషన్లు, గ్రామపంచాయితీల్లో కలిపి సుమారుగా ఒక లక్ష అరవై ఐదు వేలు (165000) కార్మికులు ఉన్నారు. వీటిలో 70శాతం పైగా పారిశుధ్య కార్మికులు ఉంటే మిగతా ముప్పై శాతంలో వివిధ రకాల చిన్న చిన్న టెక్నికల్ కార్మికులు, పర్యవేక్షణ చేసే కార్మికులు ఉంటారు. ఈ కార్మికుల్లో టెక్నికల్ కార్మికులకు ఒక రకమైన వేతనాలు ఉంటే అత్యంత తక్కువ వేతనాలు పారిశుధ్య కార్మికులకే. గ్రామ పంచాయతీల్లో అన్ని రకాల కార్మికులకు ఒకే రకమైన జీతం(9500) ఇస్తే మున్సిపాలిటీలలో మాత్రం వివిధ హోదాలుగా జీతాలున్నవి. అవి కూడా నామమాత్రమే. ఈ నామమాత్రపు జీతాల్లో కూడా వివక్ష పారిశుధ్య కార్మికులకే. కారణం సుస్పష్టం.

ఈ మాట అంటే సమాజంలో చాలామంది ఒప్పుకోకపోవచ్చు కానీ అదే వాస్తవం. అదేమంటే ఆ పారిశుధ్య కార్మికుల్లో ఉండేది మెజారిటీ దళితులని చెప్పుకున్నాముగా వారి జీతం ఇంతే సరిపోతుంది అనే భావన అధికార వర్గాల్లో ఉండటమే. అధికార వర్గాలు సమాజపు ఆలోచనలకు భిన్నంగా ఏమి ఉండవనడానికి నిదర్శనం. ఏ రంగాల్లో అయినా క్లిష్టమైన పనులకు ఎక్కువ జీతాలు ఇవ్వడం అనేది న్యాయమైనది. కానీ అత్యంత కష్టమైన పనిని చేసే ఈ సఫాయి కార్మికుల వేతనాల గురించి ఎవరూ పట్టించుకోరు. పాలకవర్గాలు మాత్రమే కాదు సమాజంలో వివిధ వర్గాల హక్కుల కోసం, వివక్షకు వ్యతిరేకంగా నిరంతరం మాట్లాడే పౌర సమూహాలు కూడా పనిగట్టుకుని ఈ పారిశుధ్య కార్మికుల గౌరవ జీవనం కోసం స్థిరంగా మాట్లాడి కొట్లాడినట్టు కనపడదు. కారణాలు అనేకం అయినా. ఎవరో ఒకరు ఆ పని చెయ్యకపోతే ఎట్లా అనే ప్రశ్నలు లేవనెత్తుతారు. ఎవరో ఒకరు చెయ్యాలి అంటారు. వారినెవరు చేయమన్నారు అనే అహంకారపు వాదనతో వినిపిస్తారు. గ్రామ పారిశుధ్య కార్మికులతో పోలిస్తే నగర పారిశుధ్య కార్మికుల జీవితాలు ఇంకా దుర్భరమైనవి. నగరం గుర్రుపెట్టి నిద్రపోతున్నపుడు వీళ్ళు రోడ్లమీదకు వస్తారు. మనం నిస్సిగ్గుగా వదిలిన వ్యర్థాలన్నిటినీ అప్పుడప్పుడూ మెడలోతు మురుగులో మునిగి శుభ్రం చేస్తారు. వరదలు సంభవించిన సందర్భంలో అది ఎంత వేదనాభరితమో వర్ణించలేము. కొన్ని క్షణాలు మురుగుకాలువల పక్కన నడిస్తే ముక్కులు మూసుకుని పరుగులు తీస్తాం. మన మలమూత్ర విసర్జితాలను వదిలే మన ఇంటి పాయకానలు శుభ్రం చేయడానికి ముక్కుకు గుడ్డలు కట్టుకుని రోజంతా ఇబ్బంది పడతాం. అటువంటిది నిత్యం ఆ మురుగు కంపులోనే ఉండే వారి జీవితం ఎంత దుర్భరమైనది. ఒక్కసారి ఆలోచించి తలుచుకుంటేనే ఒళ్ళు గగుర్లు పొడుస్తుంది మానవత్వం ఉన్న ఎవరికైనా.

అటువంటి ఈ మనుషుల పట్ల ప్రభుత్వాలు కనీసం మానవీయంగా ఆలోచించకపోవడం శోచనీయం. నాగరిక మనుషులుగా వారి పట్ల మనకు కనీస చింతన లేకపోవడం అమానవీయమే. అంతరిక్షం మీద నివాసాలకు అనువైన పరిస్థితుల ఏర్పాటుకోసం పరిశోధనలు చేస్తున్న ఈ దేశ శాస్త్ర సాంకేతికత పరిశోధనా సంస్థలు పారిశుధ్య నిర్వహణ కోసం ఆధునిక ఆవిష్కరణలు చేయకపోవడాన్ని ఎట్లా అర్థం చేసుకోవాలి. ఈ సమాజంలో ఇటువంటి పనులు చేసే మనుషులు ఎప్పటికీ ఉండాలని కోరుకునే పాలకుల ఆలోచన ధోరణి కాదా అని అనిపిస్తూ ఉంటుంది.

## 20 సంవత్సరాలుగా గణనాధుని సేవలో



**తార్నాక (ప్రశ్న న్యూస్)** తార్నాక నాగార్జున నగర్ కాలనీలో గత 20 సంవత్సరాలుగా గణేశుని సేవలో సభ్యులు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నారు. ప్రతి ఏడాది వినాయక చవితి సందర్భంగా కాలనీ సభ్యుల ఆధ్వర్యంలో గణేశుడిని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో నేటికీ అదే భక్తి, సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వర్ రావు, బి.వి. సుబ్బారావు, పండారి, గంగాధర్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, మహేశ్వర్ మూర్తి తదితరులు పాల్గొని ఉత్సవాల నిర్వహణలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. రెండు దశాబ్దాలుగా గణేశుని సేవను కొనసాగించడం పట్ల కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఆళ్ల నాని కన్నుమూత

**- గుండెపోటుతో హఠాన్మరణం**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఏపీ మాజీ డిప్యూటీ సీఎం ఆళ్ల నాని గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. విశాఖలోని తన నివాసంలో ఆయనకు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించేలోపే ప్రాణాలు విడిచారు. ఆయన ఆకస్మిక మృతి వార్త ఏలూరు నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ వర్గాలను, పార్టీ శ్రేణులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆళ్ల నాని వయసు 56 సంవత్సరాలు. 1969లో ఏలూరులోని శనివారపుపేటలో జన్మించారు. ఏలూరు సి.ఆర్.రెడ్డి కాలేజీలో ఇంటర్మీడియట్, ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో బీకామ్ పూర్తి చేశారు. కాంగ్రెస్ పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన ఆళ్ల నాని, 2004లో తొలిసారిగా ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత 2009లో కూడా కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2013లో కాంగ్రెస్ కు గుడ్ బై చెప్పి వైసీపీలో చేరారు. 2017లో వైసీపీ తరపున ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. 2019లోనూ ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం డిప్యూటీ సీఎంగా వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిగా బాధ్యతలను నిర్వహించారు. గత ఎన్నికల తర్వాత వైసీపీని వీడిన ఆయన 2025 ఏప్రిల్ లో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఆళ్ల నాని మృతి పట్ల ఏపీకి చెందిన రాజకీయ నేతలు సంతాపం ప్రకటిస్తున్నారు. ఏలూరులో ఆయన భౌతికకాయాన్ని దర్శించుకునేందుకు అనుచరులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు.

## తెలంగాణ కాంగ్రెస్‌కు
# కొత్త ఇంఛార్జ్

**- మీనాక్షి స్థానంలో రాజస్థాన్ మాజీ సీఎం.?**




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ కాంగ్రెస్‌కు కొత్త ఇంఛార్జ్ రాబోతున్నారా.? మీనాక్షి స్థానంలో మరో సీనియర్ నేతను ఇంఛార్జ్‌గా అధిష్ఠానం నియమించనుందా.? ఈ ప్రశ్నలకు అవుననే సమాధానం వినిపిస్తోంది. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జ్ మార్పుపై పార్టీలో చర్చ మొదలైంది. ప్రస్తుత ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ సుమారు పది నెలల పాటు విదేశాలకు వెళ్లి ఉన్నత విద్య అభ్యసించేందుకు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో ఆమె స్థానంలో కొత్త ఇంఛార్జ్‌ను నియమించేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం కసరత్తు చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ పదవికి రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్ పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. గెహ్లోట్‌తో పాటు కాంగ్రెస్ సీనియర్ నేతలు ముకుల్ వాస్నిక్, శక్తిసింహ్ గోహిల్ పేర్లను కూడా అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే కొత్త ఇంచార్జ్ ఎంపికపై తుది నిర్ణయం ఇంకా వెలువడలేదు. పార్టీ రాష్ట్ర వ్యవహారాలను సమన్వయం చేయడంతో పాటు సంస్థాగతంగా కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసే బాధ్యతలను కొత్త ఇంచార్జ్‌కు అప్పగించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. నటరాజన్ దీర్ఘకాలిక సెలవు తీసుకుంటే తెలంగాణకు తాత్కాలికంగా లేదా కొత్తగా పూర్తిస్థాయి ఇంచార్జ్‌ను నియమించే అంశాన్ని అధిష్ఠానం పరిశీలిస్తున్నట్లు సమాచారం.

ఈ నేపథ్యంలో అనుభవజ్ఞుడైన అశోక్ గెహ్లోట్ పేరు తెరపైకి రావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. రాజస్థాన్ ముఖ్యమంత్రిగా సుదీర్ఘకాలం పనిచేసిన గెహ్లోట్‌కు పార్టీ సంస్థాగత వ్యవహారాలు, ఎన్నికల నిర్వహణలో విస్తృత అనుభవం ఉంది. మరోవైపు ముకుల్ వాస్నిక్, శక్తిసింహ్ గోహిల్ కూడా సీనియర్ నాయకులుగా ఉన్నందున తుది ఎంపికపై ఆసక్తి నెలకొంది. అధిష్ఠానం నిర్ణయం తర్వాతే తెలంగాణ కాంగ్రెస్ కొత్త ఇంఛార్జ్‌పై స్పష్టత రానుంది.ఇక మీనాక్షి నటరాజన్ 2025 ఫిబ్రవరి 14న తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఏఐసీసీ ఇంచార్జ్‌గా బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు ఈ బాధ్యతలు నిర్వహించిన దీపాదాస్ మున్షీ స్థానంలో ఆమెను నియమించారు. తెలంగాణ కాంగ్రెస్ రాజకీయ పరిణామాలతో అప్పటికే పరిచయం ఉన్న నటరాజన్ 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీ తరఫున ఏఐసీసీ పరిశీలకురాలిగానూ పనిచేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ఎన్నికల వ్యూహం, పార్టీ సంస్థాగత వ్యవహారాలపై ఆమెకు ముందుగానే అనుభవం ఉండటం రాష్ట్ర ఇంచార్జిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడానికి దోహదపడింది. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ అధి నాయకత్వంతో ఆమెకు సన్నిహిత సంబంధాలు ఉండటంతో రాష్ట్ర వ్యవహారాలను ఎప్పటికప్పుడు చక్కబెట్టారని నేతలు చెబుతుంటారు. మీనాక్షి నటరాజన్ మధ్యప్రదేశ్‌లోని మందసౌర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి 2009లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో ఆమె 30 వేలకుపైగా ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అనంతరం జాతీయ స్థాయిలో కాంగ్రెస్ వ్యవహారాల్లోనూ కీలక బాధ్యతలు నిర్వహించారు.

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీతో సన్నిహితంగా పనిచేసిన నేతగా ఆమెకు పార్టీలో గుర్తింపు ఉంది. ఇటీవల మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు వెళ్లేందుకు ఆమె ప్రయత్నించగా తృటిలో అవకాశాన్ని చేజార్చుకున్నారు. మీనాక్షి దాఖలు చేసిన రాజ్యసభ నామినేషన్ తిరస్కరణకు గురికావడం తీవ్ర వివాదానికి దారితీసింది. ఆమె సమర్పించిన అఫిడవిట్‌లో తెలంగాణకు చెందిన ఒక కేసు వివరాలను దాచారన్న ఆరోపణలతో రిటర్నింగ్ ఆఫీసర్ నామినేషన్‌ను రద్దు చేశారు. దీంతో బీజేపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ తీవ్రంగా ఖండిస్తూ ఇది రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి విరుద్ధమని బీజేపీ సీటు చోరీ చేసిందని ఆరోపించింది. ఈ విషయంపై ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించినప్పటికీ న్యాయస్థానం జోక్యం చేసుకోవడానికి నిరాకరిస్తూ పిటిషన్‌ను కొట్టేసింది.

## తెలుగు రాష్ట్రాలకు
# కేంద్రం గుడ్‌న్యూస్

**- పీఎం ఆవాస్ యోజన కింద 5 లక్షల ఇళ్ల కేటాయింపు**




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద తెలుగు రాష్ట్రాలకు అదనంగా మరో 5 లక్షల ఇళ్లను మంజూరు చేసింది. ఇప్పటికే కేటాయించిన ఇళ్లకు అదనంగా ఈ ఇళ్లను అందించనుంది. ఇందులో ఆంధ్రప్రదేశ్‌కు 3 లక్షలు, తెలంగాణకు 2 లక్షల ఇళ్లు కేటాయించింది. ఈ నిర్ణయంతో రెండు రాష్ట్రాల్లోని ఇళ్లు లేని పేద కుటుంబాలకు ప్రయోజనం కలగనుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అర్హత ఉన్న కుటుంబాలు సొంతింటి నిర్మాణానికి కేంద్రం అందించే సాయాన్ని పొందే అవకాశం ఉంటుంది.ఇప్పటికే తెలుగు రాష్ట్రాలకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద భారీగా ఇళ్లను కేటాయించిన కేంద్రం.. తాజాగా మరో 5 లక్షల ఇళ్లకు ఆమోదం తెలిపింది. కొత్త కేటాయింపులతో మరింత మంది నిరుపేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరే అవకాశం ఉంది. త్వరలో జిల్లాల వారీగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుంది. అర్హతలు, ఎంపిక విధానం, లబ్ధిదారుల జాబితాకు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులు వెల్లడించనున్నారు. అర్హత ఉన్న కుటుంబాలు ప్రభుత్వ ప్రకటనలపై దృష్టి పెట్టాలని అధికారులు సూచిస్తున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588